ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 11 మార్చి 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:19 (మంగళ)
సహరి : 4:52 (బుధ)

అధికారితో..

ఆంధ్రజ్యోతి
ఫోన్ ఇన్

జిల్లాలోని ఆర్టీసీ బస్సులు, డిపోలు, బస్టాండ్లలో నెలకొన్న సమస్యలపైన, బస్సుల రాకపోకల్లో నెలకొన్న ఇబ్బందులపైన 12వ తేదీ బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు
94406 25154
నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ చర్యలు తీసుకుంటారు.



జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు బోల్తా

- ఏలూరు ఆశ్రం జంక్షన్ వద్ద ప్రమాదం
- 13 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

ఏలూరు ఆశ్రం ఆసుపత్రి జంక్షన్ జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడి 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. నాలుగు రోజుల క్రితం సమీపంలోనే ఓ ప్రైవేట్ బస్సు బోల్తా పడి నలుగురు మృతి చెందిన ఘటన మరువక ముందే సోమవారం మరో ప్రమాదం జరగడం ఆందోళన కలిగిస్తోంది.

7



'ఛలో విజయవాడ' భగ్నం

- ఎక్కడికక్కడ అంగన్‌వాడీల అడ్డగింత
- నరసాపురం, పాలకొల్లు రైల్వే స్టేషన్‌లలో నిలిపివేత
- పోలీసు చర్యలను నిరసిస్తూ ఆందోళన

తమ డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన 'ఛలో విజయవాడ' కార్యక్రమాన్ని జిల్లాలో పోలీసులు అడ్డుకున్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లతోపాటు నాయకుల ఇళ్ల వద్ద గస్తీ నిర్వహించి విజయవాడ వెళ్లకుండా అదుపులోకి తీసుకున్నారు. దీనిపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాలు (చిత్రంలో చింతలపూడి) చేశారు.

6


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

సత్వరం పరిష్కారం : కలెక్టర్

ఏలూరు టూటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి సోమవారం వినతులు స్వీకరించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వ రరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్ డీఏ పీడీ విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

నేరగాళ్లతో జాగ్రత్త : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అధికారుల పేరుతో మోసపూరిత ఫోన్‌కాల్స్ చేసి అకౌంట్‌కు సంబంధించి కేసులు ఉన్నట్టు చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు.



ఈ..సారీ లేనట్లే!

ఊరించి ఉసూరుమనిపించి
ఎమ్మెల్సీ స్థానాల కోసం కడదాక ఆశలు

- వివిధ సమీకరణలతో చేజారిన అదృష్టం
- టీడీపీ, బీజేపీ సీనియర్లకు ఆశలు గల్లంతు
- విధేయత పేరిట అంతా సైలెంట్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఉమ్మడి పశ్చిమలో ఎమ్మెల్సీ పదవులు ఆశించిన నేతలందరికీ చివరకు నిరుత్సాహమే దక్కింది. ఎమ్మెల్సీ స్థానాలు తక్కువగానే ఉన్నా ఏదొక స్థానం తమకు దక్కకపోతుందా అని సీనియర్లంతా ఆశతో చూశారు కాని వారి లెక్క కాస్తా తప్పి వీరందరి ఆశలు ఆవిరి అయ్యాయి. ఉమ్మడి పశ్చిమ నుంచి టీడీపీ పక్షాన మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రులు పీతల సుజాత, కె.ఎస్.జవహర్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఈ పరిస్థితుల్లో సీనియర్లుగా ఉన్న తమకు ఓ ఛాన్స్ ఇస్తారన్న నమ్మకానికి వచ్చారు. ఈ కోణంలోనే వీరిలో సత్యనారాయణరాజు, పీతల సుజాత వంటి వారి అభ్యర్థిత్వాలు పరిశీలనలోకి వచ్చాయి. సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకుని వీరికి ఛాన్స్ ఇచ్చే విషయంపై తర్జనభర్జన సాగింది. ఎస్సీ మహిళా కోటాలో సుజాత పేరు చివరి వరకు వచ్చింది. సీనియర్‌గా ఉన్న ఆమెను ఎంపిక చేస్తే సామాజిక పరంగా కొంత వెసులుబాటు ఉంటుందని పార్టీ ఆలోచించినట్టు బయటకు పొక్కింది. ఆమెవిధాన పరిషత్‌లో ఉంటే నేరుగా వైసీపీ వాదనలను తిప్పికొట్టడమే కాకుండా ఆమెపై ఎదురుదాడి చేయడానికి వైసీపీ సాహసించే అవకాశం లేదన్నట్టు ఒక దశలో లెక్క కట్టారు. ఆమెకు నామినేట్ పదవుల్లో భాగంగా ఛైర్మన్ పదవి ఇచ్చినట్టే ఇచ్చి సాంకేతిక కారణాల దృష్ట్యా ఆ తర్వాత నిర్ణయం ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఈ విషయాన్ని చర్చలోకి తీసుకున్నారు. కాని చివరికి కావలి గ్రీష్మకు అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంతో సుజాత ఆశలన్నీ నీరుగారాయి. తన అభ్యర్థిత్వం పరిశీలనలోకి వచ్చిన వెంటనే సుజాత, ఆమె అనుయాయుల సంతోషానికి హద్దు లేకుండా పోయాయి. చివరికి ఈ నిర్ణయం మారడంతో వీరంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోవాల్సి వచ్చింది. మాజీ మంత్రి జవహర్ పేరు బలంగా వినిపించినా తుదకు ఆయన పేరు ప్రచారంలో లేకుండాపోయింది. ఇంతకుముందు మీ-కోసం యాత్రలోను, లోకేశ్ యువగళం యాత్రలోను కీలక పాత్ర పోషించిన పాందువ్వకు చెందిన మంతెన సత్యనారాయణరాజు సైతం ఎమ్మెల్సీ పదవిని ఆశించారు. సామాజిక అంశాల దృష్ట్యా అటు పిఠాపురంలో వర్మ పేరు నలుగుతుండగానే ఇటువైపు ఉమ్మడి పశ్చిమ నుంచి సత్యనారాయణరాజు పేరు తెర ముందుకు వచ్చింది. వీరిద్దరిలో ఒకరికి ఛాన్స్ తప్పదన్నట్టుగా పార్టీలో భారీ చర్చ సాగింది. కాని సమీకరణల నేపథ్యంలో అటు వర్మకు, ఇటు మంతెనకు ఇద్దరికి ఛాన్స్ లేకుండా పోవడంతో అందరూ ఖంగుతిన్నారు.

ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని సైతం ఒక ఛాన్స్ దక్కపోతుందా అన్న ఆశతో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ త్యాగశీలుర జాబితాలో గన్ని ఉన్నారు. ఉమ్మడి కృష్ణా నుంచి మాజీ మంత్రి దేవినేని ఉమా, ఉమ్మడి పశ్చిమ నుంచి గన్ని పేర్లు తెర ముందుకు వచ్చినట్టే వచ్చి ఆ తర్వాత సామాజిక, ప్రాంతీయ సమీకరణలో పక్కకు జరిగిపోయాయి. ఎమ్మెల్సీ టికెట్లు ఆశించి రాకుండా పోగా కాస్తంత అసంతృప్తికి గురైన వారిని అధిష్ఠానం దూతలు ఫోన్ చేసి శాంతింపచేశారు. మరో ఛాన్స్ ఉందని ఓపిక పట్టాల్సిందిగా వ్యక్తిగతంగా ఫోన్‌లు చేసి మరీ అనునయించారు. దీంతో పార్టీ ఆదేశాల మేరకు అంతా సైలెంట్ అయ్యారు. కేడర్ మాత్రం కూటమిలో బీజేపీకి, జనసేనకు జరుగుతున్న న్యాయం తెలుగుదేశంలో జరగడం లేదన్న వాదన మరింతగా పుంజుకుంది.



• బీజేపీలో మరో సీను

ఎమ్మెల్సీ కోటాలో తమకూ ఓ స్థానం కావాలని బీజేపీ చివరి క్షణంలో పట్టుపట్టడం, సీఎం చంద్రబాబు సమ్మతించడంతో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. వాస్తవానికి ఈ ప్రతిపాదన రాకముందే భీమవరానికి చెందిన రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ పాకా సత్యనారాయణకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని పార్టీ నుంచి గట్టిగా డిమాండ్ వినిపించింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయన ఈ పదవికి అన్ని విధాలా అర్హుడన్న వాదన వినపడింది. ఈ నేపథ్యంలోనే ఆయనకు మద్దతు ఇచ్చే వీలున్నా పార్టీ సీనియర్లంతా ముందుకు కదిలారు. కాని బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు అదృష్టం దక్కింది. ఇదే తరుణంలో కొన్నాళ్లపాటు వీర్రాజుకు, టీడీపీకి మధ్య అగాధం ఏర్పడిన విషయాన్ని కూటమిలో అనేక మంది ప్రస్తావన తీసుకువచ్చారు. ఇదే తరుణంలో పార్టీని నమ్ముకుని గడిచిన దశాబ్దంన్నరగా కష్టించి పనిచేస్తున్న తపనా చౌదరిని ఎంపిక చేస్తే బాగుండేదన్న వాదన వినిపించింది. గడిచిన పార్లమెంటు ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ స్థానాన్ని చౌదరి ఆశించారు. అది కాస్తా చివర్లో చేజారింది. ఈ క్రమంలో పార్టీకి అన్ని విధాలా కట్టుబడి ఉన్న చౌదరికి అవకాశం ఇవ్వాలని కోరినా ఈ సారీ ఆయనకు అవకాశం ఇవ్వకుండా నీరుగార్చారు.


ప్రభ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కొల్లేటికోట.. భక్త జనసంద్రం

- జలదుర్గ, గోకర్ణేశ్వర స్వామి కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులు
- ప్రభల ఊరేగింపులో రహదారులన్నీ జనమయం

కైకలూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోటలో పెద్దింట్లమ్మగా పిలవబడే జలదుర్గ అమ్మవారికి, గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావడంతో సోమవారం ఆలయం కిక్కిరిసింది. అర్ధరాత్రి 2.16 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత కల్యాణోత్సవానికి గోకర్ణపురం నుంచి కొల్లేటికోటకు గోకర్ణేశ్వర స్వామిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలనంతరం కల్యాణతంతు మొదలైంది. పందిరిపల్లి గూడెం గ్రామస్థులు ఏర్పాటు చేసిన భారీ ప్రభ ఊరేగింపులో కూటమి నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 20 వేల మంది పైబడి భక్తులు పాల్గొన్నారు. పందిరి పల్లిగూడెం, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు, గోకర్ణపురం, పైడిచింతపాడు నుంచి వందలాదిగా కలువ బోనాలతో ఊరేగింపుగా మహిళలు తరలి వచ్చారు. కైకలూరు రూరల్ వి.రవికుమార్, రూరల్ ఎస్ఐ వి.రాంబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అమ్మ వారిని దర్శించుకున్నారు. కల్యాణ ఏర్పాట్లను ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీపీ నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, పెన్మెత్స త్రినాథరాజు, జనసేన నాయకులు ఘంటసాల వెంకట లక్ష్మి, కొల్లి వరప్రసాద్, పందిరిపల్లి గూడెం సర్పంచ్ బలే వెంకటరమణ, సముద్రుడు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న ప్రభ ఊరేగింపు


కలువబోనాలు తీసుకొస్తున్న మహిళలు

ఐదు బడులు షురూ!

- ఎమ్మెల్యేల వద్దకు ఎంఈవోలు, ప్రత్యేకాధికారులు
- ప్రస్తుత పాఠశాలల్లో ఒక్కటీ మూతపడకుండా చర్యలు
- మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటులో 'పశ్చిమ' ముందంజ

ఏలూరు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయతలపెట్టిన ఐదురకాల బడులపై జిల్లాకు సంబంధించి స్పష్టత వచ్చినా క్షేత్రస్థాయిలో వీటిని ఏర్పాటు చేయడానికి కొన్నిచోట్ల ఎదురవుతోన్న ఆటంకాలను పరిష్కరించే బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించారు. ప్రస్తుతమున్న పాఠశాలల్లో ఏ ఒక్కటీ మూసివేయాల్సిన పరిస్థితులు లేకుండా అన్నింటినీ కొనసాగిస్తూనే ఐదురకాల బడులుగా పునర్వ్యవస్థీకరించడానికి చేపట్టిన కసరత్తులో భాగంగా ఆయా పాఠశాలల ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)ల నుంచి అనుమతి/ అంగీకారంతో తీర్మానాలు తీసుకోవాల్సిన దశలో పలు ఎస్ఎంసీలు అభ్యంతరాలను తెలపడం గమనార్హం. వారిని ఒప్పించడంలో మండల స్థాయిలోనే విద్యాశాఖాధికారులు పలువురు విఫలమైనట్టు సమాచారం అందడంతో ఎస్ఎంసీలను ఒప్పించి, ఐదురకాల బడులపై ప్రతిపాదనలకు తీర్మానాలను చేయించే బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల వద్దకు ఆయా పంచాయతీల వారీగా ఐదురకాల బడులపై ప్రతిపాదనలను ఎంఈవోలు, ప్రత్యేకాధికారులు తీసుకెళతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను దూరాభారంలోని ఉన్నత పాఠశాలలకు తరలించడం వల్ల ఏలూరు జిల్లాలో సుమారు 249 పాఠశాలల బాలబాలికలు సమీప హైస్కూళ్లకు వెళ్లాల్సి వచ్చేది. తాజాగా ఏర్పాటుచేయ ప్రతిపాదించిన ఐదురకాల బడుల్లో ఇంతకుముందు హైస్కూళ్లకు తరలించిన ప్రాథమిక తరగతులన్నింటినీ ఆయా ప్రాథమిక పాఠశాలలకే వెనక్కి పంపడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళతున్నారు. ఇక ప్రతీ తరగతికి ఓ టీచరు, అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయతలపెట్టిన 298 మోడల్ ప్రైమరీ స్కూళ్ల విషయంలో స్థానికుల నుంచి సానుకూలత వ్యక్తమవుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏలూరు అర్బన్, రూరల్ మండలాల్లో ప్రతిపాదించిన 26 ఫౌండేషనల్ స్కూళ్ల విషయంలో 25 స్కూళ్ల ఎస్ఎంసీలు తమ వ్యతిరేకతను తెలిపినట్టు సమాచారం. ఇక్కడ ఒకేఒక్క ఫౌండేషనల్ స్కూలు ఏర్పాటుకు ఎస్ఎంసీ నుంచి సానుకూలత వచ్చింది.



ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదనలు..

ఏలూరు జిల్లాలోని 27 మండలాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన 111 క్లస్టర్ల పరిధిలోని 617 పంచాయతీల్లో ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటి, రెండో తరగతిలతో కూడిన ఫౌండేషనల్ స్కూళ్లు 218, ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు ఉండే మోడల్ ప్రైమరీ స్కూళ్లు 298, సహజ సిద్ధమైన అడ్డంకుల కారణంగా పునర్వ్యవస్థీకరణకు అవకాశం లేనందున ఎల్‌కేజీ, యూకేజీలతో పాటు, ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు బోధించే బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 843 ఏర్పాటయ్యేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇవిగాక ప్రాథమికోన్నత పాఠశాలలు 49, ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు లేదా ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు బోధించే హైస్కూళ్లు 204 కలిపి జిల్లాలో మొత్తం 1,612 ఉన్నాయి. ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాలల్లో పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏ ఒక్కటీ మూసివేయాల్సిన పరిస్థితులు తలెత్తకుండా ఐదు బడుల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తంమీద ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఐదురకాల బడుల ఏర్పాటుపై ఆదివారం నాటికి ప్రగతి ఎలా ఉందంటే.. ఏలూరు జిల్లాలో మూడు డివిజన్లకు గాను 27 మండలాల్లో 111 క్లస్టర్లలో 617 పంచాయతీలుండగా మొత్తం 1,612 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 1,119 పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు కసరత్తు పూర్తికాగా, 975 పాఠశాలల ఎస్ఎంసీలు సానుకూలతను తెలిపాయి. మరో 490 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించిన మోడల్ ప్రైమరీ స్కూళ్లలో 154 పాఠశాలలను ప్రారంభించడానికి ఇప్పటి వరకు ఆమోదం లభించింది.

ఇక పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు డివిజన్లకు గాను 20 మండలాలను 89 క్లస్టర్లుగా ఏర్పాటు చేయగా, వీటిలో మొత్తం 513 పంచాయతీల పరిధిలో 1396 పాఠశాలలున్నాయి. వీటిలో 1,381 పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టగా 1,370 పూర్తయ్యాయి. మరో 11 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 1000 పాఠశాలల నుంచి ఐదురకాల బడులకు అంగీకారం లభించింది. అత్యధికంగా 262 మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుకు సానుకూలత రావడం ఉమ్మడి జిల్లాలో 'పశ్చిమ' ప్రత్యేకతగా చెప్పవచ్చు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ స్కూళ్ల విషయంలో ఏలూరు జిల్లా కంటే పశ్చిమ గోదావరి జిల్లా ఒక అడుగు ముందంజలోనే ఉండడం గమనార్హం.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో తపనా చౌదరి, విశ్వ హిందూ పరిషత్ నాయకులు

హిందువులపై దాడి తగదు : కలెక్టరేట్ వద్ద వీహెచ్‌పీ ధర్నా

ఏలూరు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో వీరభద్రస్వామి ఉత్సవాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వీహెచ్‌పీ కార్యదర్శి సత్య రవి కుమార్ మాట్లాడుతూ పోలీసులు ఒక వర్గం వారికి అనుకూలంగా పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. హిందూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాయచోటి ఎస్ఐను సస్పెండ్ చేయాలన్నారు. చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, నిర్మల కిశోర్, పాములు, సురేష్ కుమార్, గడ్డం నాగరాజు, గ్రంధి ప్రభాకరరావు, కృష్ణప్రసాద్, సీహెచ్.విక్రమ్‌కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నుంచి సాగర్ జలాలు విడుదల చేయాలి

అసెంబ్లీలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



నూజివీడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో ఉన్న నాగార్జున సాగర్ ఎడమ కాల్వ థర్డ్‌జోన్‌లోని 2.36 లక్షల ఎకరాల్లోని ఆరుతడి పంటలను ఆదుకునేందుకు తక్షణం సాగునీరును విడుదల చేయాలని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎడమ కాల్వ పరిధిలోని రెండు, మూడవ జోన్‌లలో సాగు, తాగు నీరందని వైనంపై 'జలయుద్ధం' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో యార్లగడ్డ మాట్లాడుతూ.. '32 టీఎంసీల సాగు, తాగునీరు విడుదల చేయాల్సి ఉండగా, తెలంగాణ ప్రభుత్వం అరకొరగా కేవలం 18 టీఎంసీలు మాత్రమే విడుదల చేసింది. దీని ఫలితంగా ఆరుతడి పంటలకు సక్రమంగా నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట ప్రాంతంలో చెరువులు నీరులేక వెలవెలబోతున్నాయి. మూడవ జోన్‌కు రెండు వేల క్యూసెక్కులు నిరాటంకంగా ఏప్రిల్ 15 వరకు తెలంగాణ నుంచి సాగర్‌జలాలు విడుదల చేయించి ఆరుతడి పంటలను రక్షించాలి. ఇంకా ఆంధ్రప్రదేశ్‌కు 13 టీఎంసీలు వాటా సాగర్ డ్యామ్ నుంచి రావాల్సి ఉంది. గన్నవరం, తిరువూరు, మైలవరం, నందిగామ నియోజకవర్గాలతోపాటు ఏలూరు జిల్లా పరిధిలోని నూజివీడు, దెందులూరు నియోజక వర్గాల్లోని చివరి ఆయకట్టు భూములకు నీరు అందించాల్సి ఉందం'టూ ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కాగా అసెంబ్లీలో యార్లగడ్డ స్పందించిన విధంగానే మిగిలిన నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి రైతులకు అండగా నిలవాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.

చూచిరాత..కేసు నమోదు

ఏలూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సెకండియర్ గణితం, జంతు శాస్త్రం, చరిత్ర పరీక్షలకు జిల్లాలో 12,826 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 12,485 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 11,022 మందికి 10,809 మంది, ఒకేషనల్ విభాగంలో 1,804 మందికి 1,676 మంది హాజరయ్యారు. ఏలూరు ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల కేంద్రంలో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా తనిఖీ బృందాలు పట్టుకుని డిబార్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



అజ్జమూరులో హైవే వద్ద రుద్రాయకోడు డ్రెయిన్ దుస్థితి

రుద్రాయకోడును ప్రక్షాళన చేయండి..

ఆకివీడు రూరల్(ఆంధ్రజ్యోతి): వరదముంపు, అదనపు జలాలు తీసుకెళ్లే రుద్రాయకోడు మేజర్ డ్రెయిన్ ప్రక్షాళన కోసం ఎదురుచూస్తోంది. ఉండి - ఆకివీడు మండలాల్లోని చెరుకువాడ - తరటావ గ్రామాల వద్ద ఉన్న వెంకయ్య-వయ్యేరు కాలువను ఆనుకుని ప్రారంభమయ్యే రుద్రాయకోడు మేజర్ డ్రైన్ ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల్లో 18 కిలోమీటర్లు ప్రయాణిస్తోంది. ప్రస్తుతం ఈ డ్రైన్ నిర్లక్ష్యానికి గురైంది. మురుగు కాలువ చిట్టడవిలా దర్శనమిస్తోంది. జాతీయ రహదారి అజ్జమూరు వద్ద డ్రెయిన్ గట్లు తప్ప ఏమీ కనిపించడం లేదు. తూడు, గుర్రపు డెక్క, కిక్కసతో పూడుకుపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకి మారి వరి పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. డ్రెయిన్ గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొన్నిచోట్ల ఇళ్ల స్థలం పట్టాలు పొంది గట్లపై పక్కా ఇళ్లు నిర్మించారు. కాళ్ల మండలంలో కొంతమంది రుద్రాయ కోడు గట్లు తవ్వి తమ చెరువుల్లో కలిపేసుకున్నట్టు అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ప్రత్యేకంగా కాలువలపై శ్రద్ధ పెట్టి ఎక్కడికక్కడ ప్రక్షాళన మొదలు పెట్టారు. ఆక్రమణలు తొలగిస్తూ కాలువలలో పేరుకున్న తూడు, గుర్రపుడెక్క, కిక్కసను తొలగింపజేస్తున్నారు. ఇదేతరహాలో రుద్రాయకోడును ప్రక్షాళన చేసి పంట పొలాలను రక్షించాలని రైతులు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజును కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో పంట, మురుగు కాలువలు ప్రక్షాళనకు నోచుకోకపోవడంతో ప్రధాన కాలువలన్నీ తూడు, గుర్రపు డెక్క, కిక్కిస, జమ్ములతో నిండిపోయి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సాగు నీరు పంట పొలాలకు సక్రమంగా అందక, కలుషిత నీటితో పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాల్వల ప్రక్షాళనకు నడుం బిగించింది. పలు కాల్వలు సమస్యలు తీరినప్పటికీ ఇంకా చాలా మిగిలే వున్నాయి. ఈ కాల్వల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కలను తొలగించి, కాల్వలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. కాల్వల దుస్థితిపై ఆంధ్రజ్యోతి పరిశీలన..

సిద్ధాంతం బ్యాంక్ కెనాల్‌లో మొలిచిన పచ్చ గడ్డి, పిచ్చిమొక్కలు



ఆంధ్రజ్యోతి పరిశీలన

కన్నీటి కాల్వలు

- గత వైసీపీ పాలనలో కాల్వల ఆధునికీకరణపై నిర్లక్ష్యం
- డ్రెయిన్లు, కాల్వల్లో పేరుకుపోయిన తూడు
- సాగునీరందక రైతుల కష్టాలు
- ఆధునికీకరణ పనుల కోసం ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు
- ముంపు నుంచి కాపాడాలంటూ వేడుకోలు

చిక్కిన సిద్ధాంతం బ్యాంక్ కెనాల్

పెనుగొండ (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండే సిద్ధాంతం ప్రధాన బ్యాంక్ కెనాల్ ప్రస్తుతం బక్కచిక్కిపోయింది. గుర్రపుడెక్క పచ్చగడ్డి , పిచ్చిమొక్కలు వ్యర్థాలతో నిండిపోయి పిల్ల కాలువలా మారింది. సిద్ధాంతం, కోడేరు, ప్రధాన బ్యాంక్ కెనాల్‌గా పిలవబడే ఈ కెనాల్‌పై ఆధారపడి సుమారు 30 వేల ఎకరాలకు పైగా సాగునీరు ఈ కాలువ ద్వారానే సరఫరా అవుతుంది. కాలువ పరిస్థితి ఇలా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల రైతులకు ఎంతో ప్రయోజనకవరమైన బ్యాంక్ కెనాల్‌ను ప్రక్షాళన చేయాలని రైతులు కోరుతున్నారు.



బొండాడపేట వద్ద అస్తవ్యస్తంగా ఉన్న మొగదిండి మేజర్ డ్రెయిన్

నిర్లక్ష్యం నీడలో మొగదిండి మేజర్ డ్రెయిన్

కాళ్ల(ఆంధ్రజ్యోతి) : కాళ్ల మండలంలో ప్రధానంగా బొండాడ, మొగదిండి, రుద్రాయకోడు మేజర్ మురుగు డ్రెయిన్లు ప్రవహిస్తున్నాయి. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన ముంపు నీరు ఈ మురుగు కాలువల ద్వారానే ప్రవహించి ఉప్పుటేరులో కలుస్తాయి. అయితే వీటి ప్రక్షాళన విషయంలో గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూర్తిగా పూడుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ప్రధానంగా మొగదిండి మేజర్ మురుగు డ్రెయిన్ పూర్తిగా ఆక్రమణకు గురవడంతో డ్రెయిన్ పరివాహక పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మురుగు కాలువ కాళ్ల మండలంలో జక్కరం, సీసలి, బొండాడపేట, బొండాడ, ఎల్ఎన్ పురం, ఇసుకలంక, మాలవానితిప్ప, ఎస్‌సి బోస్ కాలనీ, కలువపూడి, మోడి గ్రామాల మీదుగా ప్రవహిస్తోంది. ఈ గ్రామాల పరిధిలో కొంత మంది ఎక్కడికక్కడ డ్రెయిన్ ఆక్రమించడంతో నీటి ప్రవాహానికి ఇబ్బంది తలెత్తుతోంది. సీసలి గ్రామ పరిధిలో ఆక్వా ఫ్యాక్టరీల యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఆక్వా సంబంధిత వ్యర్థ జలాలను నేరుగా మురుగు కాలువలోకి వదిలివేడంతో పూర్తిగా కలుషితమైంది. అంతేకాకుండా పెద్ద ఎత్తున సిమెంట్ రాళ్లను తీసుకొచ్చి కాలువను పూడ్చివేసి తమ లారీలకు పార్కింగ్‌గా వేసుకున్నారని బొండాడపేట రైతులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటువంటివి జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నరసాపురం కాలువ వ్యర్థాల మయం...

ఇరగవరం(ఆంధ్రజ్యోతి) : దమ్మెను నుంచి ప్రారంభమైన నరసాపురం బ్రాంచ్ కాలువ మోర్త, పాలంగి, ఉండ్రాజవరం పట్టణంలోని జంగంరెరువు, ఎన్జీవో కాలనీ, తణుకు పాతవూరు మీదుగా తణుకు శివారు గోస్తనీ కాలువలో కలుస్తుంది. నరసాపురం బ్రాంచ్ కాలువగా సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. ఇంతటి ప్రాధాన్యత కలిగి ఉన్న ఈ పంట కాలువ ఆనుకుని ఉన్న గ్రామాల్లోని ప్రజలు తమ మరుగుదొడ్ల గొట్టాలు నరసాపురం కాల్వలోకి పెట్టి నేరుగా వదిలేస్తున్నారు. దీనికి తోడు కాలువలో పూడిక పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. దీంతో శివారు రైతులు సాగు నీరందడం లేదు. శివారు రైతులు జనరేటర్లను ఉపయోగించుకుని సాగు చేసుకోవాల్సి వస్తుంది. నెలల తరబడి చెత్త పేరుకుపోవడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనలు భరించలేక ప్రజలు మగ్గిపోతున్నారు. పంట కాలువల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పడేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి పంట కాలువలోకి గొట్టాలు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వ్యర్థాలతో నిండిన ఇరగవరం కాలనీలోని కాలువ



తాత్కాలిక పనులొద్దు..

ఆచంట (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలంలో మురుగు డ్రెయిన్లు పలుచోట్ల మట్టితోను, మరి కొన్నిచోట్ల గుర్రపు డెక్కతోను పూడుకుపోయాయి. ఇంకొన్నిచోట్ల రైతులు ఆక్రమించుకున్నారు. తాడేరు, నక్కల, కొఠాలపర్రు ప్రధాన మురుగు డ్రెయిన్లు. ఏటా మురుగుబోదెలోని గుర్రపు డెక్క నివారణకు మందు స్ప్రే చేయిస్తున్నారు. ఇది తాత్కాలికం కావడంతో మళ్లీ గుర్రపు డెక్క మొలిచి మురుగు బోదెలను ముంచెత్తుతోంది. ఈ మురుగు డ్రెయిన్లను శాశ్వతంగా కాపాడుకోవాలంటే పూర్తిస్థాయిలో పూడుకుపోయిన వాటిని తవ్వి శుభ్రం చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

నట్టేట ముంచుతున్న నక్కల డ్రెయిన్

యలమంచిలి(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా సార్వా సీజన్‌లో భారీ వర్షాలు పడినపుడు నక్కల డ్రయిన్ పొంగిపొర్లి రైతులను నట్టేట ముంచుతోంది. ఈ డ్రైన్ చాలాచోట్ల పూడికతో నిండిపోవ డంతో మురుగు పారక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో అధికంగా వర్షాలు పడితే డ్రైలో మురుగు తిష్ట వేసి వేలాది ఎకరాల్లో వరిచేలను ముంచేస్తోంది. దీంతో రైతాంగం తీవ్ర నష్టాలను చవి చూస్తోంది. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు వద్ద మొదలైన ఈ నక్కల డ్రెయిన్ సుమారు 40 కిలోమీటర్లు ప్రవహించి యలమంచిలి మండలం వడ్డిలంక గ్రామం వద్ద గోదావరిలో కలుస్తోంది. ఈ మురుగు కాలువపై ఆధారపడి సుమారు 42 వేల ఎకరాల ఆయకట్టులో వరి సాగవుతోంది.ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోని వర్షాలకు డ్రెయిన్ పొంగి పొర్లడం పరిపాటిగా మారింది. ఈ డ్రయిన్‌ను ఆనుకుని ఉన్న ఆచంట, ఆచంట వేమవరం, గుమ్ములూరు, వద్దిపర్రు, కాంభొట్లపాలెం, గుంపర్రు, చింతదిబ్బ, కట్టుపాలెం, వడ్డిలంక గ్రామాల పరిధిలో సుమారు ఐదువేల ఎకరాలు ముంపుబారిన పడి పూర్తిగా దెబ్బతింటున్నాయి.



తూడుతో ఉన్న నక్కల డ్రయిన్

ముంపుబారిన పంట పొలాలు

నరసాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రధాన డ్రెయినేజీలు పూడుకుపోవడం, చెత్తతో పెరుకుపోవడం వల్ల ఈ కాల్వకు ఆనుకుని రైతులు సాగు చేస్తున్న వందలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయి. రుస్తుంబాద, నత్తలావ, దర్బరేవు, నల్లిక్రిక్, సరిపల్లి డ్రైనేజీలు చాలా వరకు పూడుకుపోయాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటిని పట్టించుకోలేదు. ఈ కారణంగా కొద్దిపాటి వర్షాలు, వరదలొస్తే వందలాది ఎకరాలు నీట మునుగుతున్నాయి. చాలామంది రైతులు సాగు చేయలేక సార్వా పంటకు స్వస్తి చెప్పేస్తున్నారు. డ్రైనేజీలను ఆధునికీకరించాలని అనేక మార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం కనిపించడం లేదు. కనీసం ఈ వేసవిలోనైనా డ్రెయినేజీలను ప్రక్షాళన చేస్తే సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని రైతులు భావిస్తున్నారు.



పూడుకుపోయిన రుస్తుంబాద డ్రెయినేజీ



మైప గ్రామంలో పూడుకుపోయిన స్కిన్నెరపురం బ్రాంచ్ కెనాల్

పూడుకుపోయిన స్కిన్నెరపురం బ్రాంచ్ కెనాల్

పాలకోడేరు(ఆంధ్రజ్యోతి) : అత్తిలి నుంచి మైప మీదుగా మోగల్లు వెళ్లే ప్రధాన పంట కాలువ పూడుకుపోయి అటు తాగు నీరుకు, ఇటు సాగు నీటికి ఇబ్బంది కలిగేలా ఉన్నాయి. మైప గ్రామంలో అత్తిలి నుంచి వచ్చే స్కిన్నెరపురం బ్రాంచ్ కెనాల్‌కు ఆనుకుని రొయ్యలు, చేపల చెరువులు ఉండటంతో ఆ గట్టు దిగబడి మైప గ్రామంలో పంట కాలువ కోతకు గురైతాగు, సాగు నీరందక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.. ఈ కాలువ గట్టు దిగబడిపోయి పూడుకుపోవడంతో ఆ ప్రాంత రైతులకు సాగు నీరందక నానా పాట్లు పడుతున్నారు. పొట్ట దశలో ఉన్న పంట పొలాలకు సాగు నీరందని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వంలో పంట కాలువల ప్రక్షాళన విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా నీటి సంఘాల ద్వారా కాలువలను అభివృద్ధిపరిచి తాగు, సాగునీటి కష్టాలను తీరుస్తారేమోనని మైప, కోరుకొల్లు, మోగల్లు గ్రామస్తులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

కాలం చెల్లిన రెగ్యులేటర్..

- ఆధునికీకరణ అవసరమంటున్న రైతులు
- సామర్థ్యానికి మించి వస్తున్న వరద
- ఎగువ ప్రాంతాల్లో మునిగిపోతున్న పొలాలు



దువ్వ వద్ద ఉన్న రెగ్యులేటర్

తణుకు రూరల్(ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ ముంపు నుంచి పంట పొలాలను కాపాడేందుకు శిథిలావస్థకు చేరిన దువ్వ రెగ్యులేటర్‌ను పునర్నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో కురిసే భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల్లోని వాగులు పొంగి పొర్లి ఎర్ర కాలువ ద్వారా యనమదుర్రు డ్రెయిన్‌లో చేరి భీమవరం సమీపంలోని యనమదుర్రులో ఉప్పు టేరులో చేరి అక్కడి నుంచి సముద్రంలో కలుస్తోంది. నిడదవోలు మండలం నందమూరు వరకూ ఎర్రకాలువ అని, అక్కడి నుంచి యనమదుర్రు డ్రెయిన్, మధ్యలో దువ్వ వద్ద వయ్యేరు కాలువగా పిలుస్తారు. ఈ డ్రెయి న్‌పై దువ్వలో 1930లో రెగ్యులేటర్‌ను నిర్మించారు. సు మారు 90 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రెగ్యులేటర్ ప్రస్తుతం శిథిలావస్థలకు చేరడంతో సమస్యలు తలెత్తి ప్ర వాహం నిలిచిపోతోంది. ఫలితంగా గట్లకు గండ్లు పడి వరద పంట చేలను ముంచెత్తుతోంది. ఈ రెగ్యులేటర్ సామర్థ్యం 16 వేల క్యూసెక్కులు కాగా ఏటా జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలో సుమారు 20 వేల క్యూసె క్కులకు పైగా వరద ప్రవహిస్తోంది.

వరద పరిస్థితి ఇలా..

ఎర్రకాలువ, యనమదుర్రు డ్రెయిన్‌లు పొంగి ఏటా ఉండ్రాజవరం, తణుకు, అత్తిలి మండలాల్లోని వేలాది ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోతున్నారు. దువ్వ రెగ్యులేటర్ వద్ద వరద పారుదల సామర్థ్యం తక్కువగా ఉండటం, కాల్వకు గండ్లు పడటం వంటి సమస్యలతో ఉండ్రాజవరం మండలంలోని కాల్దరి, సూర్యారావుపాలెం, సత్యవాడ, తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లోని వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. 2018, 2024 సంవత్సరాల్లో ఒకేసారి 23 వేల క్యూసెక్కుల వరద రావడంతో రెగ్యులేటర్ వద్ద రోడ్డు కోతకు గురైంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ వస్తే రెగ్యులేటర్ ఉనికికే ప్రమాదమని రైతులు పేర్కొంటున్నారు.



రెగ్యులేటర్‌పై అధ్వానంగా ఉన్న నడక దారి

నడక దారికి ఇబ్బంది..

దువ్వ వద్ద వయ్యేరుపై ఉన్న రెగ్యులేటర్ నీటి సామర్థ్యాన్ని నియంత్రించడంతోపాటు గ్రామ ప్రజలకు, పరిసర గ్రామాల వారికి జాతీయ రహదారిని దాటేందుకు మార్గంగా ఉంది. ముఖ్యంగా దువ్వలో కొత్తగా వెలసిన కాలనీకి వెళ్లేందుకు, దువ్వ నుంచి కోనాల, ముద్దాపురం గ్రామాల ప్రజలు రహదారి కింద నుంచి రోడ్డుకి చేరేందుకు ఉన్న అండర్ పాస్‌కు దగ్గరి మార్గంగా రెగ్యులేటర్ వంతెన ఉంది. దీనిపై నుంచి నిత్యం ప్రజలు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. రెగ్యులేటర్‌ను ఆధునీకరిస్తే వరదనీటి ప్రవాహాన్ని క్రమబద్ధం చేయడంతోపాటు రైతులు, పాదచారులు జాతీయ రహదారికి సమాంతరంగా మార్గం సులభం చేసినట్లవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

రెగ్యులేటర్‌ను ఆధునికీకరించాలి

బూరుగుపల్లి ఆనంద రమేష్, మాజీ సర్పంచ్, కోనాల



దువ్వలో శిథిలావస్థకు చేరిన రెగ్యులేటర్‌ను ఆధునీకరించి పంట నష్టాలను అరికట్టాలి. రెగ్యులేటర్ వద్ద వరద ప్రవాహ సామర్థ్యం తగ్గిపోవడంతో డ్రైన్‌కు గండ్లు పడి పొలాలు ముంపునకు గురువుతున్నాయి. దీంతో పాటు నందమూరు నుంచి ముద్దాపురం వరకూ ఉన్న తూముల అవుట్ లెట్, ఇన్‌లెట్‌లు కూడా పాడయ్యాయి. వీటికి మరమ్మతులు చేపట్టి పంట పొలాలను ముంపు సమస్య నుంచి కాపాడాలి.

రెండుసార్లు ప్రతిపాదనలు పంపాం

దువ్వ వయ్యేరు రెగ్యులేటర్ ఆధునీకరణకు రెండు సార్లు ప్రతిపాదనలు పంపించాం. ఈ రెగ్యులేటర్ నిర్మాణానికి 2018లో రూ.12 కోట్లతో, 2024లో రూ.18 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం నుంచి అనుతులు వస్తే నిర్మాణ పనులు ప్రారంభిస్తారు.

-అనిల్ తేజ, ఇరిగేషన్ ఏఈ అత్తిలి

త్వరలో ఉత్తరాంధ్రకు పోలవరం నీరు : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి):నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి ఉత్తరాంధ్రకు సాగు నీరందిస్తాం. 2026 జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తాం' అని రాష్ట్ర జలవనరులు శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని మంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. '700 కిలోమీటర్ల మేర ప్రవహించే హంద్రీనీవా ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే రాయలసీమ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి' అని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖలో 99 పనులకు రూ.37.63 కోట్లు మంజూరు అయ్యాయని, పట్టణంలోని దమ్మయ్యపర్తి మురుగు డ్రెయిన్ ప్రక్షాళన చేస్తామని, యలమంచిలి మండలంలో గోదావరి ఏటి గట్టు పటిష్టతకు మురుగు కాలువల ప్రక్షాళన పనులు జరుగుతున్నాయని రామానాయుడు తెలిపారు. కాజ, మాధవాయపాలెం స్లూయిస్ మరమ్మతులకు రూ.9 కోట్లు అంచనాలతో ప్రతిపాదనలు చేశామని, చింతలపూడి ప్రాజెక్టు పనులు కూడా త్వరలో ప్రారంభించనున్నట్టు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ మేరకు పాలకొల్లులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 86మంది లబ్ధిదారులకు రూ.63.33 లక్షల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం సహాయ నిధి పథకాన్ని నిర్వీర్యం చేశారని అన్నారు. కూటమి ఆధ్వ ర్యంలో నూరు శాతం మందికి సహాయం అందిస్తున్నామని తెలిపారు.



సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి నిమ్మల రామానాయుడు

ఛలో విజయవాడ భగ్నం



పాలకొల్లు రైల్వే స్టేషన్ వద్ద బైఠాయింపు

- ఎక్కడికక్కడ అంగన్‌వాడీల అడ్డగింత
- నరసాపురం, పాలకొల్లు రైల్వే స్టేషన్‌లలో నిలిపివేత
- పోలీసు చర్యలను నిరసిస్తూ ఆందోళన

నరసాపురం/పాలకొల్లు అర్బన్/తణుకు/చింతలపూడి/ కైకలూరు, మార్చి10(ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన 'ఛలో విజయవాడ' కార్యక్రమాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లతో పాటు నాయకుల ఇళ్ల వద్ద గస్తీ నిర్వహించారు. సోమవారం ఉదయం నరసాపురం నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళ్లేందుకు ప్రయత్నించిన వంద మంది రైలు ఎక్కనివ్వలేదు.రెండు గంటల పాటు స్టేషన్‌లోని విశ్రాంతి గదిలో కూర్చో బెట్టి తర్వాత విడి చిపెట్టారు. దీన్ని నిరసిస్తూ అంగన్‌వాడీల స్టేషన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శ నగా వచ్చారు. అక్కడ కళ్లకు గంతలు కట్టి రాస్తారోకో చేశారు. న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. పాలకొల్లు రైల్వే స్టేషన్ వద్ద 100 మంది అంగన్ వాడీలను నిలిపివేయడంతో వారు అక్కడే ఆందోళన చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యా లయం వద్ద ధర్నా చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తణుకులో అంగన్‌వాడీలను కదల నివ్వకుండా వారి ఇళ్ల వద్ద పోలీసులు నిఘా పెట్టారు. చింతలపూడి బోసుబొమ్మ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఆందోళనకు పలుచోట్ల సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఐ, సీపీఎం మద్దతు ప్రకటించాయి. పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి టి.త్రిమూర్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎద్దేవా చేశారు. సీఐటీయూ నాయకుడు జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలు 42 రోజుల సమ్మె చేసిన సమయంలో టెంట్‌ల వద్దకు వచ్చి సంఘీభావం ప్రకటించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక తమ గోడు చెప్పుకునేందుకు అవకాశం కల్పిం చకుండా అడ్డుకోవడం శోచనీయమని తెలిపారు. అంగన్‌వాడీల సంఘ నాయకులు ఆర్.వి.సత్యనారాయణ శాంతియుత ధర్నాలకు వెళ్లనీయకుండా ప్రభుత్వం నిర్బంధకాండ ప్రయో గించి పోలీసు యంత్రాంగంతో నిలువరించిందని ఆరోపించారు.సీఐటీయూ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అంగన్‌వాడీలను ఇళ్ల వద్ద నిర్బంధించడం, అక్రమ అరెస్ట్‌లకు పాల్పడటాన్ని ఖండించారు. ఆందోళనల్లో బోగేశ్వరి, వెంకటలక్ష్మి, రామసీత, సంగీత, రాణి, సుభాషిణి, తాయారు, పద్మావతి, ధనలక్ష్మీ,శ్యామల, నాగగౌరి, పెద్ది లక్ష్మి, కంచర్ల గురవయ్య, టి.బాబు, ధర్మారావు, ఆదినారాయణ బాబు, గార రంగారావు, కనకదుర్గ, ధనలక్ష్మి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను కైకలూరు రైల్వే స్టేషన్లో పోలీసులు అడ్డుకున్నారు. కూటమి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు ఎల్.మీనాకుమారి, విజిత, ఝూన్సీ ఆందోళన చేపట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పంట కాల్వల పరిశీలన

కాలుష్యంపై నమూనాల సేకరణ

పాలకోడేరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి):జాతీయ హరిత ట్రిబ్యునల్, చెన్నై వారి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సోమవారం పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో కాల్వల నుంచి నమూనాలు సేకరించారు. దిగువ 18 గ్రామాలకు ప్రవహించే అడవికోడు, ముత్యంకోడు పంట కాలువల కాలుష్యానికి సంబంధించి పలు పంట కాలువలు, బోదెల్లో నీటి నమూనాలు తీసి విశాఖలోని ల్యాబ్‌కు పంపిస్తామని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గ్రేడ్ - ఎనలిస్ట్ ఎస్. ఈశ్వరి, ఏఈ ఎస్.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేసి పోరాటం చేస్తున్న ఫిర్యాదిదారుడు, బీజేపీ నేత తోట గంగరాజు, తుండుర్రు నీటి సంఘం అధ్యక్షులు జక్కంపూడి సతీష్, డైరెక్టర్లు టి.వాసు, కె. సదానందం, దూసనపూడి సర్పంచ్ సాయి, కురెళ్ళ త్రిమూర్తులు, చీడే చిన్నా పాల్గొన్నారు.



పంట కాలువలు పరిశీలిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు



చోదిమెళ్ల వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు (ఫైల్)

డెత్.. స్పీడ్!

- విశాలమైన రోడ్లు - అత్యాధునిక వాహనాలు
- సుశిక్షణ లేని డ్రైవర్లతో జరుగుతున్న ప్రమాదాలు
- రహదారిపై తూతూ మంత్రంగా పెట్రోలింగ్ వాహనాల గస్తీ
- జిల్లాలో గత రెండున్నర నెలల్లో 120 ప్రమాదాలు, 55 మంది మృతి

డ్రైవరన్నా జాగ్రత్త నీవెనుక ఎన్నో జీవితాలున్నాయంటూ ఆర్టీసీ బస్సుల్లో కొటేషన్స్ చూస్తుంటాం.. ఆర్టీసీలో డ్రైవర్లకు సరైన శిక్షణ ఉంటుంది. వృత్తి నైపుణ్యాన్ని బట్టి బస్సుల కేటాయింపులు కూడా జరుగుతాయి. అయితే ప్రైవేటు ట్రావెల్స్‌లో మాత్రం అలా ఉండదు. నైపుణ్యంలేని డ్రైవర్ల కారణంగా ప్రయాణికులు జీవితాలు గాల్లోకలిసిపోతున్నాయి. ఏ మాత్రం ఆదమరుపుతో ఉన్నా ఇక అంతే ప్రయాణికుల జీవితాలు గాల్లో కలిసినట్టే.. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని అధికారులు చెబుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ సరైన శిక్షణ లేని డ్రైవర్లను నియమించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ప్రైవేటు ట్రావెల్స్‌కు కళ్లెం వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలతో ఆంధ్రజ్యోతి పరిశీలనాత్మక కథనం..

- ఏలూరు క్రైం(ఆంధ్రజ్యోతి)

సుదూర ప్రయాణానికి ఆర్టీసీ సంస్థ పూర్తి స్థాయిలో సదుపాయాలు కలిగిన బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ వారు పుట్ట గొడుగుల్లా వెలిశాయి. ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న బస్సులు ఉన్నప్పటికీ వాటిని నడి పేవారు సరైన శిక్షణ లేకపోవడంతోనే దుందుడు కుతనంగా వాహనం నడపడం, అకస్మాత్తుగా బ్రేకులు వేయడమో లేదా ఎటో కటో స్టీరింగులు తిప్పడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా తక్కువ సమయంలోనే ఎక్కువ దూరం వెళ్లాలనే ఆతృతతో అతి వేగంగా బస్సు లను నడపడం ఏదైనా అడొస్తే ఆ క్షణంలో ఆబస్సును అదుపులేక ప్రమాదానికి గురి చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదాల్లోనే క్షణాల్లో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మరికొంత తమ అవయవాలను కోల్పోవడం, మరి కొంతమంది అంగ వైకల్యంతో జీవించాల్సిన వస్తోంది..

జనవరి నుంచి ఇప్పటి వరకు..

ఏలూరు జిల్లాలో ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకు సుమారు 120 ప్రమాదాలు జరుగగా, వీటిలో 55 మంది మృత్యువాత పడ్డారు. మరో 150 మంది తీవ్ర గాయాలకు గు రయ్యారు. 16వ నంబరు జాతీయ రహదారిపైనే సుమారు 50 ప్రమాదాలు పైబడే జరిగాయంటే అతి వేగమే ప్రమాదానాకి కారణంగా చెప్పవచ్చు.. ఇటీవల 6వ తేదీన హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న రమణ ట్రావెల్స్ బస్సు ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ చొదిమెళ్ల వద్ద రహదారిపై ఆగి ఉన్న లారీని తప్పించబోయి ప్రమాదానికి గురై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికు లతో కూడా బస్సు డ్రైవర్ కూడా మృత్యువాత పడ్డారు. మరో 21 మంది తీవ్ర గాయాలపాల య్యారు. బస్సు డ్రైవర్ అతివేగంగా నడపడం తోనే రహదారిపై ఆగి ఉన్న లారీని తప్పించలేక ప్రమాదానికి గురయ్యాడు. ఈ సంఘటన మరు వక ముందే సోమవారం తెల్లవారు జామున విశాఖపట్టణం నుంచి గుంటూరు వెళ్తున్న ప్రైవే టు బస్సు విశాఖ పట్టణంలో ఆదివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి కేవలం 5 గంటల సమ యంలోనే ఏలూరునకు వచ్చేసింది. వాస్తవానికి రైలు ప్రయాణం కూడా ఐదున్నర గంటలు పడుతుంది. కానీ అతి వేగంతోనే ఈ బస్సు డ్రైవర్ తక్కువ సమయంలో తీసుకువచ్చాడు. ఏలూరులో ఆశ్రం జంక్షన్ వద్ద ప్రయాణికులను దించిన పది నిముషాల్లోనే అతి వేగంగా సర్వీసు రోడ్డు నుంచి జాతీయ రహదారిపై రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు పక్కన ఉన్న సిమెంటు దిమ్మలను ఢీ కొనడంతో బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 13 మంది గాయాల పాలయ్యారు. ఒకవైపు డ్రైవర్లు సరైన శిక్షణ లేక పోవడం, అతి వేగంగా వాహనాలు నడపడం, వాహన వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురి చేస్తున్నారు.

గస్తీలేని భద్రతా సిబ్బంది...

గతంలో రాత్రి వేళ పోలీసులు, రవాణా శాఖ అధికారులు స్పీడు గన్‌లతో, బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం ఈ తనిఖీలు వివిధ బందోబస్తు కారణంగా జాతీయ రహదారిపై కొరవడటంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పవచ్చు. జాతీయ రహదారిపై నిరంతరం గస్తీ నిర్వహించాల్సిన నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా సంస్థకు సంబంధించిన పెట్రోలింగ్ సిబ్బంది కూడా తూతూ మంత్రంగానే విధులు నిర్వర్తిస్తున్నారనే విమర్శలున్నాయి. రహదారిపై ఎక్కడైనా వాహనాలు ప్రమాదాలకు గురైనా, మరామత్తులకు గురై ఆగిపోయినా, పంక్చర్లకు గురైనా తక్షణం అక్కడకు చేరుకుని తక్షణ చర్యలు తీసుకుని ముందస్తుగా ఆ వాహనం చుట్టూ హెచ్చరిక బ్యానర్లు, రేడియం బోర్డులను ఏర్పాటు చేయాలి. ఈ నెల 6వ తేదీ తెల్లవారు జామున చొదిమెళ్ల వద్ద పంక్చర్ పడిపోయిన సిమెంట్ లారీకి ఎలాంటి రక్షణ చర్యలు తీసు కోకపోవడంతోనే బస్సు ప్రమాదం జరిగింది. అంతే కాకుండా జాతీయ రహదారి ఆశ్రం ఆసుపత్రి సమీపంలో కొంత భాగం సరిగా పనులు చేయకపోవడంతో ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బ్రిడ్జిల వద్ద ఎగుడుదిగుడుగా ఉండడం, అక్కడక్కడా రోడ్డు దిగిపోయి గుంటలుగా ఉండడం వల్ల అతి వేగంగా వెళ్ళే వాహనాలు అక్కడ అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

● ప్రమాదాల నివారణకు చర్యలు

ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్



జిల్లాలో ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. జాతీయ రహదారులపై చిన్న చిన్న తప్పిదాల వల్లే ఇటీవల రెండు బస్సు ప్రమాదాలు జరిగాయి. రహదారిపై ఆగి ఉన్న సిమెంటు లారీని సకాలంలో తీయించకపోవడం, ఆ సమయంలో రెండువైపులా రోడ్లు ఖాళీ ఉన్నప్పటికీ బస్సు డ్రైవర్ నిద్ర మత్తులో గమనించక ఆ లారీని ఢీ కొనడం వల్లే ప్రమాదం జరిగింది. ప్రమాదాలు జరిగిన బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి ఎన్‌హెచ్‌ఎఐ అధికారులకు తగిన సూచనలు సోమవారం ఇచ్చాం. పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు 24 గంటలు జాతీయ రహదారిపై అందుబాటులో ఉంచాం. అంతే కాకుండా మోటారు సైకిల్‌పై పోలీసులు సోమవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించేలా ఆదేశాలిచ్చాం. నేషనల్ హైవే ఆథార్టీ ఆఫ్ ఇండియా వారి పెట్రోలింగ్ వాహనాలు కూడా తరచుగా పెట్రోలింగ్ నిర్వహించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించాం. ప్రమాదాల నివారణకు రాత్రి వేళ డ్రైవర్లకు ఫేస్‌వాష్, ఎవరైనా మద్యం తాగి ఉన్నారేమోనని బ్రీత్ ఎన్‌లైజర్లతో తనిఖీలు చేయిస్తున్నాం. వాహనాలు తనిఖీలు నిర్వహించి లైసెన్సులను పరిశీలిస్తాం.



ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

జాతీయ రహదారిపై బస్సు బోల్తా

◆13 మందికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ఏలూరు సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై ఇటీవల ప్రైవేటు ట్రావెల్ బస్సు ఘోర ప్రమాదానికి గురై నలుగురు మృత్యువాతపడిన సంఘటన మరువక ముందే మరో ప్రైవేటు బస్సు సోమవారం వేకువ జామున ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి దగ్గరలో జాతీయ రహదారిపై బోల్తా కొట్టింది. అదృష్టవశాత్తు ఎవ్వరు కూడా ప్రాణాలు కోల్పోకపోయినా 13 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. విశాఖ నుంచి ఆదివారం రాత్రి యోలో ప్రైవేటు బస్సు గుంటూరుకు బయలుదేరింది. మార్గమధ్యలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద సోమవారం తెల్లవారు జామున రోడ్డుపక్కన ఉన్న సిమెంటు దిమ్మలను ఢీకొని రోడ్డుకు అడ్డంగా బోల్తా కొట్టింది. విశాఖపట్నానికి చెందిన మణప్పురం పరమేశ్, ఎం.కోటేశ్వరరావు, తిరుమలరావు, ఎస్.ఉషా కుమారి, పి.ఉషారాణి, సూరిశెట్టి సంతోష్, శ్రీమంతుల కిరణ్మయ్, ఎం.రమేశ్, ఎస్.మనోజ్‌కుమార్, సురేంద్రకుమార్, బొర్రా అంజలి, కె.రోహిత్ (గుంటూరు), నరసింహరాజు (విజయవాడ) తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో హైవేపెట్రోలింగ్ పోలీసులు నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా పెట్రోలింగ్ వాహన సిబ్బంది ఉండడంతో వారు వెంటనే వెళ్ళి సహాయ చర్యలు చేపట్టారు. మరోవైపు ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్‌కె దుర్గా ప్రసాద్, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, వారి సిబ్బంది అక్కడు వెళ్ళి సహాయ చర్యలు చేపట్టారు. 108 అంబులెన్సులలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం 10 మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళిపోయారు. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉషాకుమారి, సురేంద్రకుమార్, ఉషారాణిలు చికిత్స పొందుతున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సిటీ స్కాన్ పనిచేయకపోవడంతో ఏలూరులోని ఒక ప్రైవేటు స్కాన్ సెంటర్‌కు క్షతగాత్రులను తీసుకువెళ్ళారు. ప్రమాద సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో క్రేన్‌లను రప్పించి బస్సును త్వరితగతిన తీయింది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేశారు. సోమవారం తెల్లవారు జామున జరిగిన బస్సు ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. సమాచారం అందిన వెంటనే జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్, రవాణాశాఖ డిప్యూటీ కమీషనర్ షేక్ కరీమ్ వారి సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



బోల్తాకొట్టిన బస్సు వద్ద క్షతగాత్రులు

ఎస్ఎస్సీ పరీక్షల ప్రణాళికపై సమీక్ష

ఏలూరుసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని జడ్పీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటాపద్మశ్రీ ప్రసాద్ మూడు జిల్లాల విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో మార్చి నెలలో జరగబోయే ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సిద్ధతను సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల బలహీనతల గుర్తించి వారికి ప్రత్యేకంగా మార్గదర్శకత్వం అందించాలన్నారు.విద్యర్థులకు ప్రాక్టీస్ టెస్టులు, మాక్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో పరీక్ష భయాన్ని పోగొట్టేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ప్రయాణ సౌకర్యాలు పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలోజిల్లా పరిషత్ డిప్యూటి సిఈఓ కె భీమేశ్వరరావు , ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల డిఈఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

ఒకే రోజు లక్షలాది మంది మహిళలకు రుణాలు

● రాష్ట్ర సమాచార శాఖా మంత్రి పార్థ సారథి

ఏలూరుసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని లక్షలాది మందికి ఒకే రోజు కోట్లాది రూపాయలు రుణాలు ఇప్పించి మహిళల జీవనోపాధికి సాధికారితకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాటలు వేశారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంక్ లింకేజీ కింద 1.43 లక్షల మంది మహిళలకు 50వేల రూపాయల నుంచి 2లక్షల రూపాయల వరకు మొత్తం రూ. 1876 కోట్లు రుణాలు అందించారన్నారు. స్త్రీ నిధి కింద మరో లక్ష మంది మహిళలకు రూ.లక్ష చొప్పున వెయ్యికోట్ల రూపాయలను అందించారన్నారు. పీఎం విశ్వకర్మ కింద వెయ్యి మందికి చేతివృత్తుల కోసం లక్ష రూపాయిలు చొప్పున 10 కోట్ల రూపాయలు అందించారన్నారు. చేయూత కింద 7471 పట్టణ మహిళలకు మొత్తం రూ. 645.52 కోట్లు అందిచారన్నారు.

ఏలూరు జిల్లాలో రూ. 131.82 కోట్లు పంపిణీ

ఏలూరు జిల్లాలో రూ. 131.82 కోట్లు రుణాలను అందించడం జరిగిందని మంత్రి సారథి పేర్కొన్నారు. బ్యాంక్ లింకేజి కింద మహిళా సంఘాలకు రూ. 106.12 కోట్లు, పీఎంఏజేఏవై కింద రూ. 1.53 కోట్లు, పీఎంఎఫ్ఎంఈ- పిఎంఇజిపి కింద రూ. 1.49 కోట్లు, మెప్మా పథకంలో 7,181 మహిళా సంఘాలకు రూ. 17.43 కోట్లు , మెప్మా ఆధ్వర్యంలో నూతన వ్యాపారం ప్రారంభించుకున్న 350 మంది మహిళలకు రూ.5.25 కోట్లు అందజేశారన్నారు. మహిళలకు ప్రత్యేకించి బీసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఉచిత శిక్షణతో పాటు జీవనోపాధి కోసం 4589 మంది మహిళలకు రూ. 11.47 కోట్లు విలువైన కుట్టుమిషన్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఒకే రోజు మహిళా సంక్షేమానికి లక్షలాది మహిళలకు రుణాలు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

నలుగురు క్రికెట్ బుకీల అరెస్ట్



క్రికెట్ బుకీలను అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య

భీమవరం క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సీఐ ఎం.నాగరాజు, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన ఇండియా-న్యూజిలాండ్ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా దాడులు చేశారు. నర్సయ్య అగ్రహారంలోని శ్రీలంక ఏరియా మట్టిరోడ్డులో ఒక ఇంట్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో భీమవరం దుర్గాపురానికి చెందిన గొలగాని తవిటినాయుడు, ప్రగడ నానాజీ, అమలాపురం ముమ్మిడివరానికి చెందిన పసమట్ల నాగ సాయిలక్ష్మీ నరసింహ కృష్ణ చైతన్య వర్మ, కృష్ణా జిల్లా పెడన తోటమూల గ్రామానికి చెందిన కాసా భీమకోట మణికంఠ అనే వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వారి వద్ద మూడు లాప్‌ట్యాప్‌లు, 54 సెల్‌ఫోన్లు, రెండు టేబుల్స్ నాలుగు ఛైర్లు మొత్తం వాటి విలువ రూ. 13 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే వీరికి ఆర్గనైజర్‌గా భీమవరం పట్టణానికి చెందిన మహేష్ వర్మ అనే వ్యక్తి ఉన్నాడని దర్యాప్తులో తేలిందన్నారు. వీరి బ్యాంక్ అకౌంట్లు తనిఖీ చేయగా 125 లావాదేవీలు జరిగాయని తెలిపారు.

భర్తను హత్య చేశారు.. న్యాయం చేయండి



నిరాహార దీక్ష చేస్తున్న ఉమాదేవి, కుటుంబ సభ్యులు

పెంటపాడు, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : తన భర్త మృతికి కారణమైన వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలని పడమరవిప్పర్రు గ్రామానికి చెందిన చందనాల ఉమాదేవి అన్నారు. తనకు న్యాయం జరగాలని కోరుతూ సోమవారం పెంటపాడు గేటు సెంటర్ వద్ద తన కుమార్తె స్వాతి, మనువలతో కలసి నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్తను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ శిబిరం వద్ద కు వచ్చి బాధితులను పరామర్శించారు.

మద్యం షాపులో చోరీ

టి.నరసాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం గ్రామ శివారులో గల శ్రీ శ్రీనివాస మద్యం షాపులో గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 9వ తేదీ రాత్రి తాళాలు పగులగొట్టి మద్యం బాటిల్స్, కొంత నగదు సుమారు రూ.50వేలు విలువ చేసే ఆస్తిని అపహరించినట్లుగా గుమస్తా లోకేశ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.ఎం జయబాబు తెలిపారు.

గడ్డి ముక్కలు చేసే యంత్రంలో పడి కూలీ మృతి





ప్రమాదానికి కారణమైన గడ్డి ముక్కలు చేసే యంత్రం.. మృతుడు రవీంద్ర(ఫైల్‌ఫొటో)

పెదవేగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : గడ్డి కోసే యంత్రంలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదవశాత్తు యంత్రంలో పడిన ఆ వ్యక్తి శరీరం అతి చిన్న చిన్న ముక్కలుగా మారి, శరీరం ఆనవాళ్ళే లేకుండా పోయింది. రోజు కూలీతో పొట్ట నింపుకునే ఆ కుటుంబానికి తీరని వ్యధను మిగిల్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పెదవేగి మండలం నడిపల్లి సమీపంలోని ప్రసాద్ సీడ్స్ (మొక్కజొన్న ఫ్యాక్టరీ)లో సోమవారం రాత్రి ఈ విషాదకర సంఘటన జరిగింది. బాపిరాజు గూడెం ఫ్యాక్టరీకి సమీపంలోని బాపిరాజుగూడెం గ్రామానికి చెందిన సింగపాము రవీంద్ర మొక్కజొన్న ఫ్యాక్టరీలో కూలిపనికి వెళ్తున్నాడు. అతని భార్య విజేత ధర్మాజీగూడెంలో ఉన్న దీనికి సంబంధించిన ఫ్యాక్టరీలోకి పనికి వెళ్తుంది. ఆ ఇద్దరు కూలిపని చేస్తూ 7, 9 ఏళ్ళ వయస్సు ఉన్న ఇద్దరు ఆడపిల్లలను పోషించుకుంటున్నారు. కాగా సోమవారం సాయంత్రం భార్య విజేత ధర్మాజీగూడెం ఫ్యాక్టరీకి వెళ్ళగా, రవీంద్ర నడిపల్లి సమీపంలోని ఫ్యాక్టరీకి పనికి వెళ్ళారు. అక్కడ పశువులకు సంబంధించిన మేత (సైలేజ్)ను తయారు చేసే యంత్రం దగ్గర రవీంద్ర పనిచేస్తున్నాడు. యంత్రం దగ్గర పని చేస్తున్న రవీంద్ర రాత్రి 7గంటల సమయంలో ప్రమాదవశాత్తు అదే యంత్రంలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో మొక్కజొన్న చొప్ప (దంట్లు)తోపాటు రవీంద్ర(35) శరీరం సేకరించడానికి కూడా వీల్లేని విధంగా చిన్న చిన్న ముక్కలుగా అయ్యింది. సమాచారం అందుకున్న పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. దీనిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. భర్త మృతి సమాచారం తెలుసుకున్న భార్య విజేత ప్రమాద స్థలానికి చేరుకుని, రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయింది.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు భోగీ నుంచి జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అస్సోం రాష్ట్రం కపిరి జిల్లా కుంజూరుగాన్‌కు చెందిన ఎబినైజర్ తిర్కి (52) అస్సోం నుంచి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని దెందులూరు పరిధిలో రైలు భోగీ నుంచి ప్రమాదశాత్తు ఎబినైజర్ తిర్కి జారిపడి అక్కడికక్కడే మరణించారు. రైల్వే ఎస్ఐ పి సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యవసాయ కూలీ మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

పాలకొల్లు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చెరువు వద్ద కూలి పని చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే కూలి మృతిచెందిన ఘటన సోమవారం పాలకొల్లు రూరల్ మండలం తిల్లపూడి గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిల్లపూడి గ్రామానికి చెందిన నడపన శ్రీనివాసరావు(43) రోజువారీ లాగానే వ్యవసాయ కూలి పనికి వెళ్లాడు. చెరువు పక్కన వ్యవసాయ కూలి పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగలి కరెం ట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతు నికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుము కున్నాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హోటల్‌పై దాడి: ఐదు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



గ్యాస్ బండ్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్సు అధికారులు

ఏలూరు క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరామ్‌బాబుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఏలూరు వైఎంహెచ్‌ఎ హాలు సమీపంలో ఉన్న శ్రీ సాయిభవానీ హోటల్‌లో విజిలెన్సు అధికారులు సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఐదు గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లు (సబ్సిడీ గ్యాస్) ఉండడాన్ని గుర్తించారు. హోటల్ యజమాని అయిన గోపాలసుధీర్‌ను ప్రశ్నించి అతనిపై కేసు నమోదు చేశారు. సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో విజిలెన్సు ఎస్ఐ నాగరాజు, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కుక్కునూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో సోమవారం విజిలెన్స్ వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. కుక్కునూరులోని సాయిపవన్ ఎంటర్‌ప్రైజస్ దుకాణంలో నిల్వల్లో ఉన్న వ్యత్యాసాలను గుర్తించారు. 38,460 రూపాయల విలువ కలిగిన మూడు మెట్రిక్‌టన్నుల ఎరువులను సీజ్ చేశారు. మన రైతు సేవా కేంద్రం దుకాణంలో కూడా నిల్వల్లో ఉన్న వ్యత్యాసాలు గుర్తించారు. 63510 విలువ కలిగిన 40లీటర్ల మైక్రో న్యూట్రీయంట్స్‌ను గుర్తించి వెంటనే సీజ్ చేశారు.

పాత గొడవలతో బుల్లెట్ దగ్ధం

ఉంగుటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వారంతా ఒకానొకప్పుడు బంధువులే. ఈ ఏడాది జనవరిలో జరిగిన తగాదాలో వారి కుటుంబాల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఇరువర్గాలపై చేబ్రోలు పోలీసులు కేసు నమో దు చేశారు. ఒక మహిళ విషయమై పాత తగాదాల నేపథ్యంలో శనివారం రాత్రి మద్దాల నారాయణకు చెందిన బుల్లెట్‌ను ఇంటి ముం దు తాళం వేసి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తు లు పెట్రోలు పోసి దగ్ధం చేశారు. చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిడమర్రు సి.ఐ. మోగంటి వెంకట సుభాష్, చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ కేసు నమోదు చేశారు. ఏలూరు నుంచి పోలీసు కుక్కను రప్పించి ఆయా ప్రాంతాన్ని పరిశీలించారు. వైసీపీకి చెందిన తొమ్మిది మందిపై నారాయణ అను మానం వ్యక్తం చేశారు. సోమవారం ఈ ఘట నపై తొమ్మిది మందిపై కేసు నమోదు చేయగా పోలీసుల దర్యాప్తులో సోమవారం నాడు మద్దాల చిన శ్రీను అనే వ్యక్తిని అరెస్టుచేసి తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం

పెనుగొండ, మార్చి10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. పెనుగొండ మండలం లోని ఒక గ్రామంలో ఆదివారం నేరేడుమిల్లి రాంబాబు అనే వ్యక్తి ఒక దివ్యాంగురాలిపై ఎవరూ లేని సమయం చూసుకుని ఇంటిలోకి ప్రవేశించి అత్యాచారం చేశాడని పోలీసులు తెలిపారు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


బహిరంగ మద్యపానంపై కేసులు

ఏలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖాధికారులు సోమవారం దాడులు చేశారు. మొత్తం 23 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు.

ముగ్గురిపై కేసు

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం గ్రామంలో మువ్వా వెంకటరావుకు చెందిన పొగాకు తోటలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి ఆ పొలం తమదంటూ పొగాకు ఆకును కోసుకుని ట్రాక్టర్‌పై తరలించుకు పోయారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. పొలం యజమాని మువ్వా వెంకటరావు అడ్డుకున్నా కూడా అతనిపై దౌర్జన్యం చేయడంతో పాటు, ట్రాక్టర్‌ను బాధితుడి మీదికి వేగంగా నడపగా గాయపడినట్లు ఎస్సై తెలిపారు.

హోంగార్డుకు అస్వస్థత



చికిత్స పొందుతున్న హోంగార్డు రవికుమార్

ఏలూరు క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల బందోబస్తు డ్యూటీ కోసం పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన ఒక హోంగార్డుకు ఒక్కసారి ఛాతినొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వెంటనే ఆసుపత్రికి తరలించారు. జిల్లా హోంగార్డు యూనిట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న రవికుమార్ (హెచ్‌జి 780) ఏలూరులోని ఇంటర్మీడియట్ పరీక్షలకు బందోబస్తుగా విధులను నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఉదయం ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు ఎగ్జామ్ సెంటర్ డ్యూటీ ఎక్కడ వేశారో తెలుసుకోవడానికి రవి కుమార్ వెళ్ళారు. అక్కడ అతనికి ఛాతి నొప్పి వచ్చి కుప్పకూలి పడిపోయారు. అతనిని వెంటనే స్టేషన్ సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా ఆసుపత్రి సిబ్బంది సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) చేయడంతో అతను స్పృహలోకి వచ్చాడు. అనంతరం వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

టెన్త్ పరీక్షార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

ఏలూరు క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరుగు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. హాల్‌టిక్కెట్ చూపించి పరీక్ష కేంద్రానికి ఉచిత బస్సు ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో మాత్రమే అనుమతిస్తామన్నారు. పరీక్ష రోజుల్లో మాత్రమే ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తామన్నారు.

విదేశీ పర్యటనకు జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. వ్యక్తిగత కారణాలతో ఆమె వియత్నాంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు 8 రోజులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు.

ఘనంగా వరసిద్ధి వినాయక వార్షికోత్సవం

కామవరపుకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలోని గుర్రాలచెరువు గట్టు వద్ద గల శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద సోమవారం ఆలయ 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధిబుద్ధి వినాయకస్వామి కల్యాణం నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. మహా అన్నసమారాధన నిర్వహించారు.

రేపటి నుంచి నాగ కనకదుర్గమ్మ వార్షికోత్సవాలు



ద్వారకాతిరుమల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నాగ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు దొరసానిపాడులోని ఆలయంలో బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈనెల 12 నుంచి 16 వరకు ఉత్సవాలు జరపనున్నట్లు నిర్వాహకులు పసుమర్తి సోమశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆలయాన్ని ఇప్పటికే రంగులు, విద్యుత్ దీపతోరణాలతో సుందరీకరించారు. ఆలయ పరిసరాల్లో చలువపందిళ్లు నిర్మిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్టేజీని ఏర్పాటు చేశామన్నారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

కామవరపుకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆడమిల్లిలోని మందా సమేత శనీశ్వరాలయంలో ఫాల్గుణమాస సోమవారం సందర్భంగా భక్తులు స్వామి వారికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు జరిపారు. దోష నివారణకు పూజలు నిర్వహించారు. శనీశ్వరస్వామికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహించారు. అదే ప్రాంగణంలోని సాయిబాబా మందిర్‌లో అభిషేకం, కుంకుమపూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త తాతా సర్వేశ్వరరావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి పత్తేబాద గంగానమ్మ జాతర

ఏలూరు కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పత్తేబాదలో గంగానమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం నుంచి గురువారం వరకు గంగానమ్మ జాతర నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు నల్ల సత్యనారాయణ వరప్రసాద్ తెలిపారు. ఈ మూడు రోజులు అమ్మవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు, అమ్మవారి ప్రతిమతో ఊరేగింపులు జరుగుతాయన్నారు. 13వ తేదీన అమ్మవారి ప్రతిమతో మేళతాళాలు, బాజాభజంత్రీలతో భారీ ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. జాతర సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 23వ తేదీన ఆలయ ప్రాంగణంలో మహా అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వైభవంగా భీమేశ్వరస్వామి రథోత్సవం



నిడమర్రు మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెదనిండ్రకొలను భీమేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో వీధులన్నీ కోలాహలంగా మారాయి. మహిళలు స్వామి వారికి అరటిగెలలు, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేకా వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోదండ రామాలయానికి రూ.లక్ష విరాళం



జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రాపురంలో శ్రీ కోదండ రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ నిర్మాణానికి పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు పరిమి సత్తిపండు ఆయన తండ్రి గంగరాజు (మాజీ సర్పంచ్) జ్ఞాపకార్థం రూ.50 వేల నగదు సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సత్తిపండు మామ కొత్తపల్లి సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన భార్య కొత్తపల్లి శేష అరుణ రూ.50 వేల నగదు, పరిమి లక్ష్మీ సుజాత సీతమ్మవారి మంగళసూత్రాల నిమిత్తం రూ.ఐదు వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అధ్యక్షుడిగా రామారావు

ఏలూరు టూటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్వర్ణాంధ్ర మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ అధ్యక్షులుగా సంపంగి తారక రామారావు ఎన్నికయ్యారు. ఏలూరులో జేఏసీ సమావేశం సోమవారం జరిగింది. నూతన కార్యవర్గం చేత వ్యవస్థాపక అధ్యక్షులు టి.రంగారావు నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన కార్యదర్శులుగా ఎ.పురుషోత్తం, ఎల్.వెంకట రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, నరసింహారావు, సుంకర గురునాధరావు, కార్యవర్గ సభ్యులుగా సయ్యద్ సైదా, కసిరెడ్డి నాగిరెడ్డి, దార్ల సత్యవతి ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా ఆర్‌టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం: ఎమ్మెల్యే చంటి



ఏలూరు టూటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్ని భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే బడేటి చంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడు తూ ఎన్నికల హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామని అన్నారు. సూపర్-6 పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శకపాలనతో ముందుకు కెళ్తున్నామన్నారు. ప్రజలకు ప్రతీరోజు అందుబాటులో ఉంటానని ఏ సమయంలోనైన తనను వచ్చి కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహనంలోని చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించి, వాహన యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ మృతికి సంతాపం

టి.నరసాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):తిరుమలతిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ మృతికి ఏపీ ప్రజానాట్య మండలి సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు, సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్.ఆర్ కృష్ణబాబు వీరమల్ల సత్యనారాయణ వర్ధమాన సినీనటుడు తిరుపతి రమేష్‌బాబు, బచ్చు నందకుమార్ తదితరులు ఉన్నారు.

తడికలపూడిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కామవరపుకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలోని హైస్కూలు రోడ్డులోని కొండపై గల లూర్దుమాత గ్రౌండ్ వద్ద జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమైంది. తొలిగా వీరిశెట్టిగూడెం, జలపవారిగూడెం గ్రామానికి చెందిన జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ గ్రామ అధ్యక్షులు బొంతు వెంకటేశ్వరరావు, తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు, జడ్పీ అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలమాటి నాగేశ్వరరావు, సాయి విద్యా పాఠశాల కరస్పాండెంట్ బోయపాటి లక్ష్మి, బొళ్ళ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కాదిది.. గ్రంథాలయం!



దాతల ఆశయాలు చెత్తపాలు

ద్వారకాతిరుమల, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ఎం.నాగు లపల్లి పంచాయతీ ద్వారకానగర్ గ్రామంలో పాఠశాల లేని సమయంలో దాతలు సవలం రత్తయ్య, సవలం కనకదుర్గారావులు ముందుకొచ్చి తల్లిదండ్రుల పేరున లక్ష రూపాయలు వెచ్చించి ఎంపీపీ పాఠశాల నిర్వహణకు ఓ షెడ్డును నిర్మించి ఇచ్చారు. మూడేళ్లపాటు అందులో తరగతులను నిర్వహించారు. ఆ తరువాత ప్రభుత్వం నూతన పాఠశాల భవనాన్ని నిర్మించడంతో స్కూల్‌ను అందులోకి మార్చారు. దాతలు నిర్మించిన షెడ్డును పుస్తక పంపిణీ కేంద్రం(లైబ్రరీ)గా మార్చారు. ఈక్రమంలో రాజకీయ కారణాలతో పుస్తక పంపిణీ కేంద్రాన్ని 2019లో పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆతర్వాత దానికి తాళాలు వేశారు. అయితే దాతల సాయంతో నిర్మించిన భవనాన్ని నిరుపయోగంగా ఉంచడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఈ భవనం ఆవరణంతా చెత్త కుప్పలతో నిండిపోయింది. ఈ భవనాన్ని పుస్తక పంపిణీ కేంద్రంగా కొనసాగించాలని గతేడాది పంచాయతీకి, గ్రంథాలయ అధికారులకు నిర్వాహకుడు హరినాథరాజు లేఖలు రాసినా ఎలాంటి స్పందనా రాలేదు.

గ్రంథాలయం ఏర్పాటు చేయండి



బడిలేని ఈ గ్రామంలో నేను, నాసోదరుడు కలసి షెడ్డునునిర్మించి ఇచ్చాం. అందులో బడి మూడేళ్లపాటు నడిపారు. ప్రభుత్వం భవనం నిర్మించిన తర్వాత బడి అందులోకి మార్చి ఇందులో లైబ్రరీని ఏర్పాటు చేశారు. సరే పదిమందికి ఉపయోగపడేదేగా అని సంతోషించాం. ఆతర్వాత పంచాయతీ అవసరమంటూ దీన్ని లాక్కుని ఇప్పుడు అందులో చెత్తపోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అందులో లైబ్రరీ ఏర్పాటు చేయాలి

\- సవలం రత్తయ్య, ద్వారకానగర్

ఐటీడీఏ ఎదుట ఆందోళన



బుట్టాయగూడెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై ప్రాజెక్టు ఆఫీసర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కెఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీ ఉద్యోగులు, ఆదివాసీల పట్ల ఐటీడీఏ కార్యాలయంలోని కొందరు అధికారులు వివక్షత చూపుతున్నారని ఆరోపించారు.నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్న హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీవో కె.రాములు నాయక్‌కు అందజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆందోళన వద్దకు చేరుకుని ఆదివాసీల నాయకులతో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో డిమాండ్స్‌ను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు.

తప్పులు జరిగితే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే బాలరాజు



ఐసీడీఎస్ కార్యక్రమాలను అధికారిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా పేదలకు అందిస్తున్న సేవల్లో పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెచ్చరించారు. సోమవారం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న సేవలు, పథకాల వివరాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా కంప్యూటర్‌లోని వివరాలను, రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, ఆరోపణలు రాకుండా సేవలు అందించాలని అధికారికి, కార్యాలయం సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో తులసీ, యూడీసీ కృష్ణవేణి సిబ్బంది పాల్గొన్నారు.

13న బుట్టాయగూడెం మండల సమావేశం

బుట్టాయగూడెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 13న ఎంపీపీ కారం పార్వతి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. అధికారులు నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. గైర్హాజరయ్యే అధికారులపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

కొల్లేరు సమస్యపై లోక్‌సభ స్పీకర్‌కు నివేదిక

ఏలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ మేరకు సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నివేదిక సమర్పించారు. కొల్లేరు ప్రాంతంలో దాదాపు 4 నుంచి 5లక్షల మంది ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారని, ఇక్కడి ప్రజలు ఆక్వాకల్చర్‌పై ఆధారపడి ఉన్నారని, తరచుగా ఈ ప్రాంతంలో తలెత్తే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు మునిగిపోయి, ప్రజల ఆర్థికంగా నష్టాలు చవిచూశారని స్పీకర్‌కు ఎంపీ వివరించారు. ఈ సమస్యను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం అభయారణ్యం నుంచి ప్రైవేట్ జిరాయితీ భూములు, అసైన్డ్‌భూములను తొలగించాలని కోరుతూ రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన రెండు తీర్మానాలను జాతీయ వన్యప్రాణిబోర్డు సమీక్షించి, బాధిత రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుందని ఎంపీ పుట్టా వివరించారు. వారి జీవనోపాధిని కాపాడేందుకు అభయారణ్యం నుంచి సుమారు 22వేల ఎకరాలను మినహాయించడాన్ని ఆమోదించిందని, 2019 భీమవరం ఎన్నికల ప్రచారంలో స్థానిక ప్రజలు ఈ క్లిష్ట సమస్యను ప్రధానమంత్రి నరేంద్రమోడీ దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలమైన హామీ ఇచ్చారని ఎంపీ గుర్తు చేశారు. అయితే ఇప్పటికీ సమస్యను పరిష్కరించడంలో సుదీర్ఘజాప్యం వలన ఈ ప్రాంత ప్రజలకు అపారమైన ఆర్థిక ఇబ్బందులు, న్యాయపరమైన చిక్కులు ఏర్పడ్డాయని, దీనిపై వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు మహేష్ నివేదికలో విన్నవించారు.

పీహెచ్‌డీ నూతన పరిశోధనలకు దోహదం

పెదపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రీసెర్చ్ మరియు డిజైన్ విభాగాల్లో పీహెచ్‌డీతో నూతన పరిశోధనలు చేయడానికి దోహదం చేస్తాయని హైదరాబాద్‌కు చెందిన టెక్ ఫ్లయంట్ టెక్నాలజీస్ అప్లికేషన్ ఇంజనీర్ నితిన్‌రెడ్డి తెలిపారు. వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాపును నిర్వహించారు. వివిధ అంశాలపై ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

పెదపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అప్పనవీడు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కల్వరిశక్తిమిషన్ పాస్టర్ భూక్యా బాలరాజు, విష్ణువర్ధన్‌లు పరీక్షా సామగ్రిని అందజేసినట్లుగా హెచ్.ఎం. తోట పుష్పవతి తెలిపారు. పరీక్షా సామగ్రిని సోమవారం పాఠశాలలో అందజేశారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే



జంగారెడ్డిగూడెంలో పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి

జంగారెడ్డిగూడెం, (ఏలూరు) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలకు 18 పాఠశాలలు, ఏడు అనాధ శరణాలయాలు స్థాపించడంతో పాటు మహిళా విద్యకు ఆద్యురాలైన సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని జంగారెడ్డిగూడెం మునిసిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద బి.సి.సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని నాగలక్ష్మి ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, డాక్టర్ అలుగు ఆనందశేఖర్, మల్లాది సత్యనారాయణ, పిపిఎస్.చంద్రరావు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కేశుబాబు, బత్తిన చిన్నా, తల్లాడ నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక మేడబడి సెంటర్‌లో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం జరిగింది. పూలే విగ్రహానికి టీడీపీ నాయకులు కొత్తపూడి శేషగిరిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. పాత చింతలపూడిలో పట్టణ టీడీపీ కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 12వ తేదీన విజయవాడలో జరిగే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ కోరారు. ఉపాధి కూలీలకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఏలూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు పారిశ్రామిక భద్రత, అగ్నిమాపక ఉపకరణాల వినియోగంపై ప్రాక్టికల్ డెమోలు, అతిథి ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించారు. పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణ పద్ధతులపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, నాటిక ప్రదర్శన పోటీలను నిర్వహించారు. విజేతలకు భీమడోలు లిక్సిల్ ఇండియా ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ కట్సుహికో టకే బహుమతులను అందజేశారు. జిల్లా పరిశ్రమలకేంద్రం జనరల్ మేనేజర్ పి.సుబ్రహ్మణ్యం, కర్మాగారాల జిల్లా తనిఖీ అధికారి ఎ.శ్రీనివాసరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎ.జితేంద్ర, ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత పాల్గొన్నారు.

నేడు మహిళా ప్రాంగణంలో జాబ్‌మేళా

కామవరపుకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలోని మహిళా ప్రాంగణంలో ఈనెల 11వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, మోహన్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, వంద మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి, 10-35 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 9000803414, 9666322032లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలియచేశారు.

ఏలూరు తరలిన హిందువులు

జీలుగుమిల్లి, మార్చి, 10 : (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు బీజేపీ, వీహెచ్‌పీ నాయకుల ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతం నుంచి హిందువులు నిరసన వ్యక్తం చేసేందుకు ఏలూరు తరలి వెళ్లారు. రాయచోటి గ్రామంలో కల్యాణ ఉత్సవ మూర్తుల ఊరేగింపులో హిందువులపై దాడి చేసి అక్రమ కేసులు బనాయించినందుకు నిరసనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం హిందువులపై జరిగిన దాడిపై పూర్తి విచారణ జరపాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్రాతి ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు గుడ్ల రాంబాబు, కెఎల్.ప్రసాద్, పులగం ప్రసాదరెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

ఆర్డీవోకు అర్జీలు

జంగారెడ్డిగూడెం, (ఏలూరు) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు మండలాల నుంచి ప్రజలు తమ అర్జీలను ఆర్డీవో ఎంవి.రమణకు అందజేశారు. ఏజెన్సీ ప్రాంత భూ సమస్యలు పరిష్కరించాలని, పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తిరుమలాపురంలో 105 ఎకరాల చెరువులో అక్రమంగా చేపల పెంపకాన్ని అడ్డుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం కోరింది.

కలెక్టర్ చిత్రం గీసి ఆకట్టుకున్న అంజు



కలెక్టర్ వెట్రిసెల్వికి చిత్ర పటాన్ని అందిస్తున్న అంజు

ఏలూరు,మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నైపుణ్య, వృత్తి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాకు హాజరై విభిన్న ప్రతిభావంతురాలిగా జనవరి 29న ఏలూరు జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన బత్తుల అంజు జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి చిత్రాన్ని గీసి సోమవారం ఆమెకు బహూకరించారు. జాబ్‌మేళాలో ఉద్యోగం పొందినందుకు కృతజ్ఞతగా కలెక్టర్ చిత్రపటాన్ని పెన్సిల్ ద్వారా గీసి వెట్రిసెల్వికి అంజు అందించింది. కలెక్టర్‌తో పాటు పలువురు ఈ చిత్రపటాన్ని చూసి అంజును ప్రత్యేకంగా అభినందించారు.


కొల్లేరు కాంటూర్ సరిహద్దుల్ని గుర్తించండి

ఏలూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలోని అభయారణ్యం సరిహద్దులు గుర్తించాలని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కొల్లేరు అంశంపై ఆమె సమీక్షించారు. జీవో 120 ననుసరించి కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలోని అభయారణ్యం సరిహద్దుల సర్వేను రెవెన్యూసర్వే, అటవీశాఖాధికారులు సిబ్బందితో సర్వే బృందాలను నియమించి నిర్దేశించిన సమయంలోగా సరిహద్దులు నిర్ణయించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో వి విశ్వేశ్వరరావు, అటవీ అధికారులు ఆశా కిరణ్, పి విజయ, ఆర్డీవో అచ్యుత అంబరీష్, మత్స్యశాఖ జేడీ నాగలింగాచార్యులు, సర్వేశాఖ ఏడీ అన్సారీ పాల్గొన్నారు.

పోలవరంలో దళారుల ప్రమేయం వద్దు

ఏలూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీలో లబ్ధిదారుల గుర్తింపు, పరిహారం లెక్కింపునకు నిర్వహించే గ్రామసభల్లో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారుల నుంచే వివరాలను సేకరించాలని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ సర్వే, గ్రామసభల నిర్వహణపై కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అర్హుడైన ప్రతి నిర్వాసితునికి నిబంధనలనుసరించి పరిహారం అందేలా చూడాలన్నారు. ముంపు గ్రామాల్లో అర్హులైన నిర్వాసితులను గుర్తించి, వారి సమస్యలను తెలుసుకుని వారి భూమి, కట్టడాలు, పంట, చెట్లు తదితరాలకు పరిహారాల లెక్కింపునకు ప్రతి గ్రామంలోను గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అరుదైన రూ.800, రూ.900 నాణేల సేకరణ





నాణేలను చూపుతున్న అలీఖాన్

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్ట మొదటిసారిగా విడుదలైన రూ.800, రూ.900 నాణేలను ఏలూరు జిల్లాకు చెందిన నాణేలసేకరణ కర్త మహ్మద్ అలీఖాన్ సేకరించారు. ఈ సందర్భంగా అలీఖాన్ మాట్లాడుతూ జైన తీర్థంకురుడు పార్శ్వనాథ్ భగవాన్ 2900వ జయంతిని పురస్కరించుకుని ముంబై మింట్ (టంకశాల) రూ.800, రూ.900 నాణేలను ముద్రించి 2024 లో విడుదల చేసిందన్నారు. 40 గ్రాముల బరువైన ఈ రెండు నాణేలను పూర్తి వెండితో తయారుచేసినట్లు అలీఖాన్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో ప్రీ బుకింగ్ ఓపెన్ చేయగా ఫిబ్రవరి 19న ఈ రెండు నాణేలు బుక్ చేయగా మార్చి 6న తనకు అందాయన్నారు. తన వద్దకు రావడానికి ఒక్కొక్క నాణేనికి రూ.6700 ఖర్చు అయినట్లు అలీఖాన్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

త్వరలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

పులిగడ్డ మాధవి, ఐసీడీఎస్ పీవో, చింతలపూడి



- **అంగన్‌వాడీ సెంటర్లు ఎన్ని ఉన్నాయి? ఏ విధంగా పనిచేస్తున్నాయి ?**

జవాబు : చింతలపూడి ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. ఇందులో 218 అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ సెంటర్లు ద్వారా బాలింతలు, గర్భిణులు, బాలలకు పౌష్టికాహారం అందిస్తున్నాం.

- **ఎన్ని అంగన్‌వాడీ పోస్టులు ఖాళీలు ఉన్నాయి?**

జవాబు : మూడు మండలాల్లో 185 అంగన్‌వాడీ సెంటర్లలో ఏడు టీచర్ పోస్టులు, 33 మినీ అంగన్‌వాడీ సెంటర్లలో మూడు టీచర్ పోస్టులు మొత్తం పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- **వీటి భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారా ?**

జవాబు : ఎన్నికల కోడ్ వలన ఇవ్వలేదు. త్వరలోనే భర్తీ చేస్తాం.

- **మిషన్ వాత్సల్య పథకంలో ఎంతమందికి లబ్ధి ?**

జవాబు : ప్రాజెక్టు పరిధిలో 1100 మంది ఉన్నారు. బడ్జెట్‌లో వచ్చే నిధులు బట్టి ఒక్కొక్కరికి 24 వేల రూపాయలు చొప్పున అందాయి.

\- చింతలపూడి

'ఓపెన్' ఇంటర్ పరీక్షలకు

165 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన భౌతికశాస్త్రం పరీక్షకు 317మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకోగా 268 మంది, రాజనీతిశాస్త్రం పరీక్షకు 470 మందికి 354మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎక్కడా చూచిరాత కేసులు నమోదుకాలేదన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులకు ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం కింద ప్రతి నెలా నిర్వహించే వైద్యపరీక్షలపై సోమవారం స్థానిక తంగెళ్ళమూడి పట్టణ ఆరోగ్యకేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ రక్తహీనత, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గర్భిణులకు సూచనలు చేశారు. ప్రతీరోజు ఉడికించిన కోడిగుడ్డును తినాలని, కాయగూరలను, వేరుశెనగ ఉండలు, ఇతర ఆరోగ్యకర ఆహారపదార్థాలను భుజించాలని సూచించారు. వైద్యాధికారిణి డాక్టర్ దీప్తి గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

పెట్టుబడుల మార్కెట్‌లో రిస్క్‌లపై అవగాహన

ఏలూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) :'టెక్నాలజీద్వారా భవిష్యత్తు సాధికారత, డిజిటల్ సొల్యూషన్ ద్వారా పెట్టుబడుల ప్రణాళిక సూత్రీకరణ' అనే అంశంపై సోమవారం స్థానిక సీఆర్ఆర్ డిగ్రీకళాశాలలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం జరిగింది. రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన గుంటూరు టి.జే.పి.ఎస్.కళాశాల పీజీ కామర్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెట్టుబడి రంగంలో లోటుపాట్లు, నష్టభయం, వాటిని అధిగమించడానికి పాటించాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన బొరగం

ఏలూరుసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు జడ్పీ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటాపద్మశ్రీప్రసాద్‌ను ఏపీ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు జడ్పీ చైర్‌పర్సన్‌ను పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నేడు,రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం చేబ్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 11,12 తేదీలలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు గొల్లగూడెం ఏఈ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త 11 కే.వి.విద్యుత్తు లైన్ నిర్మాణం, మరియు లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని వివరించారు.

రిటైర్డ్ అధ్యాపకుల వితరణ

ఏలూరు అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరుయూనిట్ ప్రతినిధులు సోమవారం 60కుర్చీలను విరాళంగా అందజేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే హుస్సేన్, ఎల్.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.సి, డానియేల్, కార్యవర్గసభ్యులు ఎం.రమా సత్యవతి, కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు పాల్గొన్నారు.

'పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ'


ముదినేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారని పీఏసీఎస్ ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెం శ్రీనివాసరావు తెలిపారు. స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రిని సోమవారం సచివాలయంలో కలసి వివరించినట్లు తెలిపారు.

కేంద్ర మంత్రి దృష్టికి రహదారుల సమస్యలు


కేంద్రమంత్రి గడ్కారికి కైకలూరు నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలోని జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్ గడ్కారీని కోరినట్టు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కారీని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహనాయుడుతో కలిసి రోడ్ల సమస్యలను వివరించారు. వీటితో పాటు పలు సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కామినేని తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ ఉత్సవాలు


ధ్వజస్తంభంపై ఆంజనేయస్వామి, బేతాళుడి పటాన్ని కడుతున్న భక్తులు

కలిదిండి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెద లంకలో పోలేరమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఆంజనేయ స్వామి, బేతాళుడు ఉన్న పటాన్ని ఊరేగించగా, మహిళలు పసుపు, కుంకుమ, టెంకాయలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం పరశురాముడు ఆలయం వద్ద ఉన్న ధ్వజస్తంభంపై పటాన్ని కట్టారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అన్నసమా రాధన జరిపారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అదుపు తప్పి చేపల లోడు లారీ పల్టీ


బోల్తా పడిన చేపలలోడు లారీ

కైకలూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో లారీ అదుపు తప్పి పల్టీకొట్టింది. సోమవారం రాత్రి కైకలూరు మండలం శింగాపురంలో ఆకివీడు నుంచి గుడివాడ వైపు వెళ్తున్న చేపలలోడు లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆ సమయంలో డ్రైవర్ లారీలోనే ఇరుక్కొనిపోయాడు. కైకలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. అతనికి ఎలాంటి గాయాలు కాలేదు.

తక్కెళ్లపాడు మత్స్యకార సొసైటీ పదవీ కాలం పొడిగింపు

మండవల్లి మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం తక్కెళ్లపాడు మత్స్యకార సొసైటీ పదవీకాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు సోమవారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గం 2024 సెప్టెంబరు 26తో పదవీ కాలం ముగిసింది. కొన్ని అనివార్య కారణాల వల్ల నూతన కమిటీని ఎన్నుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో పాత సొసైటీ కమిటీని మార్చి 25, 2025 వరకు లేదా ఎన్నికల నిర్వహించి కొత్త కమిటీని ఎన్నుకునే వరకు పాత కమిటీనే కొనసాగించేలాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సొసైటీ అధ్యక్షుడిగా వరిగంజి బాబెల్ రాజు నెంబర్లుగా బద్దే ఇమ్మానియేలు, కాలగంటి మనసయ్యల కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వులు పేర్కొన్నారు.


బోల్తా పడిన బస్సు వద్ద ప్రయాణికులు, ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

జాతీయ రహదారిపై ట్రావెల్ బస్సు బోల్తా

» 13 మందికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఇటీవల ప్రైవేటు ట్రావెల్ బస్సు ఘోర ప్రమాదానికి గురై నలుగురు మృత్యువాతపడిన సంఘటన మరువకముందే మరో ప్రైవేటు బస్సు సోమవారం తెల్లవారు జామున బోల్తా పడింది. ఆశ్రం ఆసుపత్రి జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో అదృష్టవశాత్తు ప్రాణ నష్టం లేదు. 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి ఆదివారం రాత్రి యోలో ప్రైవేటు బస్సు (ఏఆర్11సీ0808) గుంటూరుకు ప్రయాణికులతో వెళుతోంది. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి జంక్షన్ వద్ద సోమవారం తెల్లవారుజామున రోడ్డుపక్కన ఉన్న సిమెంటు దిమ్మలను ఢీకొని రోడ్డుకు అడ్డంగా బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖపట్నానికి చెందిన మణప్పురం పరమేశ్, ఎం.కోటేశ్వరరావు, తిరుమలరావు, ఎస్.ఉషాకుమారి, పి.ఉషారాణి, సూరిశెట్టి సంతోష్, శ్రీమంతుల కిరణ్మయ్, ఎం.రమేశ్, ఎస్.మనోజ్‌కుమార్, సురేంద్రకుమార్, బొర్రా అంజలి, కె.రోహిత్ (గుంటూరు), నరసింహ రాజు (విజయవాడ) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా పెట్రోలింగ్ వాహన సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. మరోవైపు ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్‌కె.దుర్గా ప్రసాద్, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, వారి సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం 10 మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోయారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉషాకుమారి, సురేంద్రకుమార్, ఉషారాణి చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో క్రేన్‌ల సహాయంతో బోల్తా పడిన బస్సును పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు : ఎస్పీ

ఆశ్రం ఆసుపత్రి జంక్షన్ వద్ద ప్రమాద సమాచారం అందుకున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాల్లో తీసుకోవాల్సిన రహదారి భద్రతా చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈనెల 6న చొదిమెళ్ళ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని మరువక ముందే మరో ప్రమాదం జరగడంపై డీటీసీ షేక్ కరీమ్ స్పందిస్తూ జనవరి 1 నుంచి జిల్లాలో కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై 163 కేసులు నమోదు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని నిబంధనలు అతిక్రమించే కాంట్రాక్టు బస్సులపై కేసులు నమోదు చేయాలని వాహన తనిఖీ అధికారులను ఆదేశించామన్నారు.

మెరుగైన వైద్య సేవలు : మంత్రి ఆదేశం

బస్సు ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. ప్రమాద సంఘటన వివరాలను ఎస్పీ, ఇతర అధికారులను ఫోన్‌లో అడిగి మంత్రి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి కొలుసు


ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి

ఆగిరిపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి భరోసా ఇచ్చారు. వడ్లమాను గ్రామానికి చెందిన జలసూత్రం శివ నాగమణి కుటుంబం నివసిస్తున్న పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. త్వరలో పక్కా ఇల్లు కట్టించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. తక్షణ సాయంగా రూ.20వేలు అందచేయడంతో పాటు ప్రభుత్వం తరఫున మరో రూ.5వేలు బాధితులకు మంత్రి అందజేశారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

రైతు బజార్ నిర్మాణ పనులు పునః ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రైతు బజార్ నిర్మాణ పనుల దృశ్యం

కలిదిండి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో అసంపూర్తిగా ఉన్న రైతు బజార్ నిర్మాణ పనులు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రైతు బజార్‌పై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించారు. 2018లో టీడీపీ హయాంలో రైతు బజార్ నిర్మాణం 70 శాతం పూర్తి చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో 10 శాతం పనులే చేశారు. రైతు బజార్ అసంపూర్తిగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న రైతు బజార్ నిర్మాణానికి రూ.27 లక్షలు నిధులు మంజూరు చేయడంతో రైతు బజార్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రైతు బజార్‌లో మొత్తం 15 కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా నిర్మిస్తున్నారు. టాయ్‌లెట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలఖారుకల్లా రైతు బజార్ నిర్మాణం పూర్తి చేస్తామని కలిదిండి మార్కెట్ యార్డు కార్యదర్శి వరలక్ష్మి తెలిపారు.

ఘనంగా సావిత్రీ బాయి పూలే వర్ధంతి


ముదినేపల్లిలో సావిత్రీ బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ కైకమ్మ, నాయకులు

ముదినేపల్లి/ మండవల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయి పూలే 120వ వర్ధంతిని సోమవారం ముదినేపల్లిలో నిర్వహించారు. ఆర్టీసీ బస్ స్టేషన్ సెంటర్‌లోని మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ పూలే విగ్రహ కమిటీ అధ్యక్షులు పళ్లెం పుణ్యేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు నిమ్మ గడ్డ భిక్షాలు, కార్యదర్శి ఈడే వాసు, జన్ను వీర వెంకటేశ్వరరావు, సోమల ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. మండవల్లి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి గౌరవ అధ్యక్షుడు ఎల్ ఎస్ భాస్కరరావు, అధ్యక్షుడు కె.శాంత రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి మహిళా లోకానికి ఆమె స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

నియోజకవర్గ ఇంచార్జ్ చంద్రశేఖర్


మండవల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త చంద్రశేఖర్

ముదినేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేసేందుకు కైకలూరు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని నియోజకవర్గ పార్టీ కో-ఆర్డినేటర్ సీహెచ్.చంద్రశేఖర్ కోరారు. సింగరాయపాలెంలో సోమవారం జరిగిన జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పార్టీ కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుడు అబ్బిశెట్టి నాగబాబు, పెద గొన్నూరు డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ, మండల ఉపాధ్యక్షుడు వడ్లాని ఆంజనేయులు, బాసినశెట్టి కిశోర్ పాల్గొన్నారు.

మండవల్లి : మండవల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి జరిగిన జనసేన మండల కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చనుమోలు చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 14న పిఠాపురంలోని చిత్రాడలో పార్టీ 12వ ఆవిర్భావ సభను జనసైనికులందరూ విజయవంతం చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రాజేష్, జాతీయ కాపు సంఘం మండల అధ్యక్షుడు చెన్నంశెట్టి నందకిషోర్, నియోజకవర్గ పార్టీ లీగల్‌సెల్ అధ్యక్షుడు తణుకుల రవితేజ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రాఘవేంద్రరావు, పలువురు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

రేపు వైసీపీ యువత పోరు

నూజివీడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహిస్తున్న యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. ఆయన కార్యాలయంలో వైసీపీ నాయకులతో కలిసి సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. యువతకు లక్షల ఉద్యోగాలు కల్పించింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

ముసునూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పద్మకిశోర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చెక్కపల్లి పాఠశాల ఉపాధ్యాయినులు, వంట ఏజన్సీలు, ఆయాలను దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రభుత్వాలు మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని పద్మ కిశోర్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పద్మలత, పద్మావతి, యోగిత, ఆదిలక్ష్మి, కిరణ్, తిరుమలకుమారి, శిరోమణి పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

ముసునూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. సోమవారం చెక్కపల్లి జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, సమాధానాలను రాబట్టారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా, ఉపాధ్యాయుల బోధనలను అందిపుచ్చుకుని, మంచి మార్కులు సాధించేలా చదువుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఎంఈవో భోజనం చేశారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



గ్రామ కార్యదర్శులపై పని ఒత్తిడి


ఈఓపీఆర్డీకి వినతపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ముసునూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అధిక పనిభారం, ఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఉపశమనం కల్పించాలని మండలంలోని పంచాయతీ కార్యాదర్శులు ఈవోపీఆర్డీ బీఏ.సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరావు మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులకు వివిధ సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాలతో పని భారం పెరిగిందన్నారు. సెలవు దినాలు, పండుగ దినాలు వినియోగించుకునే అవకాశం లేక, కుటుంబ సభ్యులతో సమయం గడపలేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలించి, కార్యదర్శులపై పనిభారం తగ్గించి ఉపశమనం కల్పించాలని కోరారు. కార్యదర్శులు నీరజ, సుకుమార్ పాల్గొన్నారు.

తపనా చౌదరిని కలిసిన బీజేపీ నేతలు


తపనా చౌదరితో నూజివీడు పట్టణ బీజేపీ నాయకులు

నూజివీడు టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ నూతన కార్యవర్గం, సీనియర్ నాయకులు సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి, పట్టణంలో వార్డుస్థాయిలో పార్టీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పట్టణ బీజేపీ అధ్యక్షురాలు ఎం.నాగ రాణిని అడిగి తెలుసుకున్నారు. ఎం.రాజశేఖర్, వసుంధరాదేవి, బోను అప్పారావు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు

చాట్రాయి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాయచోటి వీరభద్రస్వామి ఆలయంలో హిందువులపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం ఏలూరులో జరిగిన ధర్నాకు మండలం నుంచి నాయకులు తరలి వెళ్లారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజర య్యారు. గడ్డం సంజీవరెడ్డి, ఓబిళ్ళనేని రాజా, బుర్రి శ్రీకర్, ధనలక్ష్మి ధర్నాలో పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి అప్పలనాయుడు, నేతలు

నూజివీడు టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి అప్పలనాయుడు కోరారు. ఆవిర్భావ సభ గోడపత్రికను సోమవారం ఆయన ఆవిష్కరించారు. నూజివీడు నుంచి భారీగా కార్యకర్తలు, వీర మహిళలు కదలివచ్చి ఆవిర్భావ సభ విజయవంతం చేయాలన్నారు. పవన్‌కల్యాణ్ నుంచి ఆలోచనా శక్తిని, జ్ఞానాన్ని, ధైర్యాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నూజివీడు జనసేన ఇన్‌చార్జి బర్మా ఫణిబాబు, జనసేన నాయకులు తోటా వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్, సూరిశెట్టి శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

ముదినేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం లెక్కలు -2 పరీక్షకు 78 మంది హాజరు కావాల్సి ఉండగా, 74 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. పెదవేగి ప్రభుత్వ గురుకుల కళాశాల పీడీ కె.జయరాజు నేతృత్వంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.


గురజలో పెండ్లి కుమారుడిగా వేణుగోపాలస్వామి

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గురజలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివార్ల వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి స్నపన తిరుమంజనోత్సవం అనంతరం స్వామిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసి అర్చకుడు తేజోరామ్, ఆగమ వాస్తు పండితుడు పరాశం శ్రీరంగ నాథాచార్యులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సహస్ర నామార్చనలు, అంకురార్పణ, కుంభారాధన హోమం, ధ్వజారోహణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అల్లూరులో పి4 సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

ముమ్మరంగా పీ-4 సర్వే

ముదినేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలంలో పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టిసిపేషన్ (పి-4) సర్వే ముమ్మరంగా జరుగుతోంది. మండలంలోని సుమారు 18,500 కుటుంబాలకు సంబంధించి ఈ సర్వేను చేపట్టి ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, సంక్షేమ పథకాల లబ్ధి, వారి అవసరాలపై గ్రామ సచివాలయాల సిబ్బంది సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 40 శాతం సర్వే పూర్తయింది. అల్లూరులో సోమవారం ఈ సర్వే ప్రారంభం కాగా, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


చెత్త సేకరిస్తున్న సిబ్బంది

ఇంటింటా చెత్త సేకరణ

చాట్రాయి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పునఃప్రారంభంలో భాగంగా పోలవరంలో సోమవారం ఇంటింటా చెత్త సేకరించారు. గ్రామ కార్యదర్శి ఎంవీఎస్.నాగరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. కార్యదర్శి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్య సమాజం నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. చైతన్యంతో అందరూ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

చాట్రాయి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా పానుగళ్ళ కోటేశ్వరరావు (ఆరుగొలనుపేట), కార్యదర్శిగా పజ్జూరి మాధవరావు(పోలవరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోలవరంలో గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కందుల కృష్ణ అధ్యక్షతన శనివారం రాత్రి జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. పానుగళ్ళ మాట్లాడుతూ గౌడ సంఘీయులకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని, గౌడ కులస్తులు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

సారా నిందితులకు రిమాండ్

చాట్రాయి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సారా కేసులలో దరావత్తు బుజ్జిబాబు, లావూరి కాంతమ్మను సోమవారం ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. తిరువూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 62 మంది

చాట్రాయి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో సోమవారం ఇంటర్ సెకండ్ ఇయర్ గణితం 2బీ, జువాలజీ-2 పరీక్షలు జరిగాయి. మొత్తం 62 మంది విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.